WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 227 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | మంగళవారం 12 ఆగస్టు 2025 | వెల : 2-00



## పోలీసులకు హైకోర్టు షాక్

వైఎస్సార్‌సీపీ కీలక నేతలు రామలింగారెడ్డి, హేమాద్రిరెడ్డిలపై తదుపరి చర్యలొద్దు

## వచ్చే మూడ్రోజులు వర్షాలు

- రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం కొనసాగుతున్న ఆవర్తనం
- వచ్చే మూడ్రోజులు వర్షాలు



**స్వర్ణసాగరం, అమరావతి / తిరుపతి**

ఉత్తర కోస్తాంధ్ర మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మంగళవారం పలుచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. 13వ తేదీ నాటికి వాయవ్య, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేందుకు ఆస్కారముందని తెలిపింది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో కోస్తాంధ్రలో చెదురుముదురుగా భారీ వర్షాలు కురిసేందుకు అవకాశమున్నట్లు వెల్లడించింది. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, - మిగతా2లో



## ఇక కొత్త ఆదాయ పన్ను చట్టం

- బిల్లును ఆమోదించిన లోక్‌సభ
- కొత్త చట్టంలో ఆలస్యంగా రిటర్న్‌లు ఫైల్ చేసినా రిఫండ్స్



## సరుకు రవాణాకు..
# లాజిస్టిక్స్ కార్పొరేషన్

- రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల కార్గో నిర్వహణా చేపట్టాలి
- సరుకు రవాణా మార్గాలకు కేంద్రంగా రాష్ట్రం
- ఎకనమిక్ హబ్‌గా రేవులు, ఎయిర్‌పోర్టులు
- శాటిలైట్ టౌన్‌షిప్పుల అభివృద్ధి జరగాలి
- సమీకృత పురోగతికి బ్లూ ప్రింట్
- షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు
- పరిశ్రమలు, మౌలిక వసతులపై సీఎం సమీక్ష

**స్వర్ణసాగరం, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల సరుకును కూడా రవాణా చేసేందుకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, రైలు, అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా చేపట్టే సరుకు రవాణాను ఈ కార్పొరేషన్ ద్వారా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలపై ఆయన సమీక్ష జరిపారు. ఎయిర్‌పోర్టులు-పోర్టుల అభివృద్ధి, మారిటైం పాలసీలో తీసుకురావలసిన మార్పులు, లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రంలో 20 పోర్టులు, మరిన్ని ఎయిర్‌పోర్టుల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని సీఎం తెలిపారు. ప్రతి రేవు, విమానాశ్రయ సమీప ప్రాంతాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఓడరేవులు, విమానాశ్రయాలకు అనుసంధానించేలా - మిగతా2లో



## నేడే పార్లమెంట్ నిరవధిక వాయిదా

- వారం ముందుగానే వాయిదాకు కేంద్రం నిర్ణయం!
- ప్రతిపక్షాల నిరసనలతో ఆత్మరక్షణలో ప్రభుత్వం




## సైబర్ మోసాలపై కేంద్రం నజర్

- పైలెట్ ప్రాజెక్టుకు తెలంగాణ ఎంపిక
- త్వరలో రాష్ట్రంలో ఒక రోజంతా సెమినార్
- దేశ ప్రజల్లో చైతన్యానికి కార్యక్రమాలు

## కదం తొక్కిన విపక్షం



- ఓట్ల చోరీ, ఎస్ఐఆర్‌పై 300 మంది ఎంపీల నిరసన
- పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి.. ఇండియా కూటమి ఎంపీల భారీ నిరసన ప్రదర్శన
- ర్యాలీలో పాల్గొన్న లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు
- మధ్యలోనే అడ్డుకుని నిర్బంధించిన ఢిల్లీ పోలీసులు
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన మహిళా ఎంపీలు
- పోలీసులతో వాగ్వాదం.. తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత
- రాహుల్, ఖర్గే, ప్రియాంక సహా పలువురు నేతల అరెసు



## పదిలో ముగ్గురే గ్రాడ్యుయేట్లు!

- యూత్‌లో 31% మందికే డిగ్రీ, ఆపై చదువులు
- మిగిలిన వారంతా ఇంటర్/డిప్లొమాకే పరిమితం
- ఉన్నత చదువులకు పల్లె యువత చాలా దూరం
- నిరక్షరాస్యులుగా 1.3 కోట్ల మంది యువత

## వివేకాహత్య గురించి జగన్‌కు అంతా తెలుసు

- కేసును రాజకీయంగా వాడుకుని వదిలేశారు
- న్యాయం జాప్యం కాలేదు.. తిరస్కరణకు గురైంది
- సుప్రీంకోర్టు పునర్విచారణకు ఆదేశించాలి
- దర్యాప్తును నాటి వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంది
- సీబీఐ అధికారులపైనే తప్పుడు కేసులు పెట్టించింది
- అసలు దోషులను గుర్తించకుండానే దర్యాప్తు పూర్తయిందని సీబీఐ తేల్చేసింది
- చార్జిషీటులోనూ కీలకాంశాలు దాచింది
- వివేకా కుమార్తె సునీతారెడ్డి వెల్లడి



**స్వర్ణసాగరం, అమరావతి**

సౌమ్యుడు, ప్రజానాయకుడైన తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డిని ఇంట్లోనే అత్యంత కిరాతకంగా హత్య చేయడం గురించి తన సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అంతా తెలుసని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి స్పష్టం చేశారు.నాన్న చనిపోయిన విషయం బాహ్య ప్రపంచానికి తెలియకముందే జగన్‌కు తెలుసన్నారు.ఈ విషయాన్ని మాజీ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం కూడా దర్యాప్తు సమయంలోనే వెల్లడించారని, సీబీఐ కూడా తెలంగాణ హైకోర్టుకు ఈ సంగతి నివేదించిందని గుర్తుచేశారు.అయితే ఆ కోణంలో సీబీఐ దర్యాప్తు చేయకుండా నిలిపివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు.నాన్న హత్య కేసును జగన్ తన రాజకీయ లబ్ధికి వాడుకుని వదిలేశారని ధ్వజమెత్తారు.ఈ హత్య కేసులో న్యాయం జాప్యం కాలేదని.. తిరస్కరణకు గురైందని వాపోయారు. వివేకా హత్యపై పునర్విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును సోమవారం అభ్యర్థించారు. 'సీబీఐ చార్జిషీటులో కీలకాంశాలు దాచిపెట్టింది. అసలు దోషులను గుర్తించకుండానే దర్యాప్తు పూర్తయిపోయినట్లు తేల్చేసింది. ఈ కేసులో పెద్ద కుట్ర దాగి ఉందని సుప్రీంకోర్టు గుర్తించింది.
- మిగతా2లో

మా బలం - సామాజిక బలం
RNI No: APTEL/2020/15906
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# గురి తప్పని 'గిరి' నౌకలు

విశాఖపట్నం

భారత నౌకాదళ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా మరో రోజు ఆవిష్కృతమవుతోంది. ప్రపంచ దేశాలకు సవాల్ విసురుతూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన రెండు అత్యాధునిక నౌకలు ఈ నెల 26వ తేదీన నౌకాదళంలో చేరనున్నాయి. ఇండియన్ నేవీ చరిత్రలో రెండు వేర్వేరు షిప్‌యార్డుల్లో నిర్మించిన ఒకే క్లాస్‌కు చెందిన రెండు యుద్ధ నౌకలను ఆరోజు ఒకే వేదికపై జాతికి అంకితం చేయనున్నారు. ప్రాజెక్ట్-17లో భాగంగా అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమైన నీలగిరి క్లాస్‌లో కీలకమైన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధ నౌకల కమిషనింగ్ కార్యక్రమాన్ని 26న తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో నేవల్ డాక్‌యార్డులో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కీలక ఘట్టానికి ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భారత నౌకా దళాధిపతి అడ్మిరల్ దినేష్ కుమార్‌త్రిపాఠీ హాజరయ్యే అవకాశం ఉంది. ముంబైలోని మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్‌లో ఉదయగిరి, కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్‌లో హిమగిరి నౌకలను నిర్మించారు. ఉదయగిరి.. నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ షిప్ కావడం మరో విశేషం.

**చైనాకు దీటుగా నౌకా నిర్మాణం**

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న సముద్ర సవాళ్లను ఎదుర్కొంటున్నందున భారత్‌కు.. ఫ్రంట్‌లైన్ స్టీల్ ఫ్రిగేట్ యుద్ధ నౌకలైన ఉదయగిరి, హిమగిరి వార్‌షిప్‌లు మరింత బలాన్నిస్తాయి. శత్రు దేశాల కవ్వింపు చర్యల్ని సమర్థంగా తిప్పికొడతాయి. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా నౌకా నిర్మాణంలో విదేశీ పరిజ్ఞానానికి స్వస్తి పలుకుతూ యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్‌లను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నౌకా నిర్మాణ సంస్థలైన హిందుస్థాన్ షిప్‌యార్డ్, మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్, కొచ్చిన్ షిప్‌యార్డ్‌తో పాటు ఎల్ అండ్ టీ వంటి ప్రైవేట్ సంస్థల సహకారంతో అధునాతన నౌకల్ని నిర్మిస్తున్నారు. ప్రపంచ నౌకా నిర్మాణంలో అగ్రగామిగా ఉన్న చైనా దూకుడుకు భారత్ అడ్డుకట్ట వేస్తోంది. చైనా సగటున 19 నౌకలు తయారు చేస్తుంటే.. భారత్ ఏటా 20 యుద్ధ నౌకలు నిర్మిస్తోంది. అయితే.. చైనాలో ఎక్కువగా వాణిజ్య నౌకల నిర్మాణం జరుగుతోంది.

**ఐఎన్ఎస్ హిమగిరి**



తయారైనది: గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్
పనులు మొదలైంది: 2018 నవంబర్ 10
తరగతి: నీలగిరి క్లాస్ గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్
బరువు: 6,670 టన్నులు, ఆయుధ సంపత్తితో 7,350 టన్నులు
పొడవు: 149 మీటర్లు
వేగం: గంటకు 28 నాటికల్ మైళ్లు (52 కి.మీ)
రేంజ్: ఏకధాటిగా 1900 కిమీ ప్రయాణం, 16 %-% 18 కి.మీ వేగంతో అయితే 10,200 కి.మీ
సెన్సార్: బీఈఎల్ రూపొందించిన హంసా ఎన్‌జీ బో సోనార్
వార్‌ఫేర్ సామర్థ్యం: 4 కవచ్ సాఫ్ లాంచర్స్
ఆయుధ సంపత్తి: సూపర్‌సోనిక్ సర్ఫేస్%-%టు%-%సర్ఫేస్ క్షిపణులు, బరాక్%-%8 యాంటీ ఎయిర్ మిసైల్స్, 8 బ్రహ్మోస్ యాంటీ షిప్ ల్యాండ్ ఎటాక్ మిసైల్స్, ఒక ల్యాండ్ ఎటాక్ క్రూయిజ్ మిసైల్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ వరుణాస్త్ర ట్రిపుల్ టార్పెడో ట్యూబ్స్ 2, యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ లాంచర్లు 2.
గన్స్: ఒక మెలారా 76 ఎంఎం నేవల్ గన్, ఏకే%-%630 గన్స్ 2 ఎయిర్‌క్రాఫ్ట్: సీకింగ్ 42 ఎయిర్‌క్రాఫ్ట్, చేతక్ హెలికాప్టర్

ఐఎన్ఎస్ ఉదయగిరి
తయారైనది: మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ పనులు
మొదలైంది: 2020 సెప్టెంబర్ 12.. 37 నెలల రికార్డు సమయంలో పూర్తి
తరగతి: నీలగిరి క్లాస్ గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్
బరువు: 6,670 టన్నులు, ఆయుధ సంపత్తితో 7,350 టన్నులు
పొడవు: 149 మీటర్లు
వేగం: గంటకు 28 నాటికల్ మైళ్లు(52 కి.మీ)
రేంజ్: ఏకధాటిగా 1,900 కి.మీ ప్రయాణం, 16 %-% 18 కి.మీ వేగంతో అయితే 10,200 కి.మీ
సెన్సార్: బీఈఎల్ రూపొందించిన హంసా ఎన్‌జీ బో సోనార్
**వార్‌ఫేర్ సామర్థ్యం: 4 కవచ్ సాఫ్ లాంచర్స్**
ఆయుధ సంపత్తి: సూపర్‌సోనిక్ సర్ఫేస్%-%టు%-%సర్ఫేస్ క్షిపణులు, బరాక్%-%8 యాంటీ ఎయిర్ మిసైల్స్, 8 బ్రహ్మోస్ యాంటీ షిప్ ల్యాండ్ ఎటాక్ మిసైల్స్, ఒక ల్యాండ్ ఎటాక్ క్రూయిజ్ మిసైల్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ వరుణాస్త్ర ట్రిపుల్ టార్పెడో ట్యూబ్స్ 2, యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ లాంచర్లు 2.
గన్స్: ఒక మెలారా 76 ఎంఎం నేవల్ గన్, ఏకే%-%630 గన్స్ 2
ఎయిర్‌క్రాఫ్ట్: 2 హాల్ ధృవ హెలికాప్టర్లు లేదా సీకింగ్ ఎంకే హెలికాప్టర్స్

# వివేకాహత్య గురించి జగన్‌కు అంతా తెలుసు

-మొదటిపేజీ తరువాయి

ఫలితంగానే హత్య కేసును 2022 నవంబరు 29న ఏపీ నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసింది'అని తెలిపారు. వివేకా 2019 మార్చి 15వ తేదీన హత్యకు గురయ్యారని,ఈ ఘటనను గుండెపోటుగా చిత్రిస్తూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భార్య భారతీరెడ్డి నడుపుతున్న 'సాక్షి'చానల్ ప్రసారం చేసిందన్నారు. దీనినే వైసీపీ ముఖ్యనేతలు పలువురు వల్లెవేశారని.. అత్యంత హేయంగా వివేకాను నరికి చంపిన ఉదంతం బయటకు పొక్కకుండా గుట్టుగా దాచేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.నాన్న గుండెపోటులో మరణించారన్న సమాచారంతో హుటాహుటిన హైదరాబాద్ నుంచి పులివెందుల వెళ్లానని.. తన తండ్రి భౌతికకాయం రక్తగాయాలతో ఉండడం గమనించానని..శరీరంపై బ్యాండేజీ కట్టి ఉండడాన్ని కూడా చూశానని తెలిపారు. తర్వాత ఈ హత్యను మరో రాజకీయ పక్షంపై రుద్దడానికి కుట్ర పన్నారని విమర్శిం చారు. వివేకా హత్య జరిగిన మరుసటి రోజున జగన్ పత్రికలో ఈ హత్యకు టీడీపీ నాయకులే బా?ధ్యులంటూ ఫుల్ పేజీలో ప్రచురించారని చెప్పారు. హత్యకు తెలుగుదేశం పార్టీ నేతలే కారణమంటూ జగన్ ఏపీ హైకోర్టులో కేసు వేశారని తెలిపారు.న్యాయం చేస్తానని ముఖ్యమంత్రి హోదాలో ఆయన



తనకు హామీ ఇచ్చారని..అయితే ఆ తర్వాత సీబీఐ దర్యాప్తు చేస్తే ఎంపీ అవినాశ్‌రెడ్డి వైసీపీని వీడి మరో పార్టీలో చేరతారని తనతో చెప్పారని తెలిపారు. తాను హైకోర్టును ఆశ్రయించడంతో..2020 మార్చి 11వ తేదీన సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా దర్యాప్తునకు అడ్డుతగిలిందని ధ్వజమెత్తారు.ఏకంగా సీబీఐ అధికారులపైనే పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు తిరస్కరించారని చెప్పారు. తన తండ్రి హత్య విషయంలో న్యాయం చేయాలని ప్రతి తలుపూ తట్టానని సునీతారెడ్డి తెలిపారు. ఈ కేసులో సీబీఐ మళ్లీ దర్యాప్తు చేయాలని. .పునర్విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు. తన న్యాయపోరాటానికి అందరి మద్దతూ కావాలని కోరారు.

# క్వాంటం వ్యాలీ అమరావతి ఆవిష్కరణలో ఎల్టీఐమైండ్ ట్రీ భాగస్వామ్యం

అమరావతి

తన మాతృ సంస్థ లార్సెన్ అండ్ టుబ్రోతో కలసి అమరావతిని భారతదేశంలోని ప్రప్రథమ క్వాంటం హబ్ గా రూపొందించేందుకు గ్లోబల్ టెక్నాలజీ కన్సల్టింగ్, డిజిటల్ సొల్యూషన్స్ కంపెని ఎల్టీఐమైండ్ ట్రీ ఒప్పందం చేసుకుంది. ఈ కలయిక అమరావతి క్వాంటం వ్యాలీని భారతదేశంలోని మొట్టమొదటి క్వాంటం టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయడంలో ఎల్టీఐమైండ్ ట్రీ నిబద్ధతను చాటిచెపుతుంది. ఈ కార్యాచరణ ఎల్టీఐమైండ్ ట్రీ, ఎల్ అండ్ టీ ప్రధాన సాంకేతికత, మౌలిక సదుపాయాల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐబీఎం వివిధ క్వాంటం పర్యావరణ సంస్థలతో కలిసి ప్రపంచ స్థాయి క్వాంటం టెక్నాలజీ హబ్ గా అమరావతిని గమ్యస్థానంగా రూపొందించుటకు ఎల్టీఐమైండ్ ట్రీ కృషి చేస్తుంది. ఈ పరస్పర సహకార ఒప్పందం ద్వారా, ఎల్టీఐమైండ్ ట్రీ క్వాంటం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వినూత్న సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ కోసం టెక్ పార్క్ సంస్థలతో కలసి పారిశ్రామిక, సామాజిక ఉన్నతికి వర్తించు

LTIMindtree

ప్రాథమిక శాస్త్ర పరిశోధనలో కీలక భాగస్వామి పాత్రను చేపడుతుంది. ఇక అమరావతి క్వాంటం వ్యాలీ మౌలిక సదుపాయాల రూపకల్పనకు అభివృద్ధి, నిర్వహణకు నిర్మాణం రంగంలోని తమ సాంకేతిక నైపున్యతలను వినియోగించుకుని భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టుటకు ఎల్ అండ్ టీ నాయకత్వం వహిస్తూ, ఆస్తుల సృష్టికి దోహదపడుతుంది. ఈ అమరావతి క్వాంటం వ్యాలీ నందలి కీలక భాగం క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం వారితో కలసి ప్రణాళిక రూపొందించింది. ఇది భారతదేశంలో ఊహకందని అతి గొప్ప క్వాంటం కంప్యూటర్ అవుతుందని అంటున్నారు. ఇందుకు అవసరమైన అత్యున్నత భవన నిర్మాణాల రూపకల్పన చేయుటకు, ఇబ్బందుల పరిష్కారానికి ఎల్ అండ్ టీ సంస్థ ఐబీఎంతో కలసి పనిచేస్తుంది. ఈ విశిష్ట ఐకానిక్ కేంద్రం ఏర్పాటుకు ప్రణాళికలు శరవేగంగా రూపొందిస్తూ, ఉజ్వల భవిష్యత్తుకు పటిష్టమైన పునాదులు వేయుటకు సంనద్ధమవుతున్నాయి. ఈ సందర్భంగా ఎల్టీఐమైండ్ ట్రీ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ వేణు లంబు మాట్లాడుతూ క్వాంటం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా, ఎల్టీఐమైండ్ ట్రీ క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికత పరిశోధన, ఇంక్యుబేషన్ ను వినూత్న మార్గాల్లో నిర్వచిస్తుందని అన్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు ఉత్తమ నైపుణ్యతలను పారిశ్రామిక, సామాజిక రంగాలకు వర్తింపచేయుటకు ఎంతో సంతోషిస్తున్నామని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీ నేషనల్ క్వాంటం మిషన్‌తో సరిసమానంగా క్వాంటం ప్రయోజనాలు పటిష్టపరచడం లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు.

## వచ్చే మూడ్రోజులు వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉంది. దీంతో.. ఈనెల 12న ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఎల్లో అలర్ట్.. 13న నంద్యాల జిల్లాకు ఆరెంజ్ అలర్ట్, కర్నూలు జిల్లాకు ఎల్లో అలర్ట్.. 14న ఉమ్మడి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్.. 15న ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్‌ను వాతావరణ శాఖ ప్రకటించింది.

**సహాయక చర్యలకు టోల్‌ఫ్రీ నెంబర్లు..**

వర్షాల నేపథ్యంలో సహాయక చర్యల కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలని ఆ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కోరారు. సోమవారానికి కాకినాడ జిల్లా రౌతులపూడిలో 4.2, అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలులో 4.1, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 4 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

## పోలీసులకు హైకోర్టు షాక్



అమరావతి

పులివెందుల జెడ్పీటీసీ ఎన్నిక సందర్భంగా వైఎస్సార్‌సీపీ కీలక నేతలు లింగాల రామలింగారెడ్డి, నంద్యాల హేమాద్రిరెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద తప్పుడు కేసు నమోదు చేసిన పులివెందుల పోలీసులకు హైకోర్టు గట్టి షాక్ ఇచ్చిం ది. వీరిపై నమోదైన కేసులో తదుపరి విచారణ వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సోమవారం ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీచేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ప్రచారం చేస్తున్న తమపై వైఎస్సార్‌సీపీ నేతలు లింగాల రామలింగారెడ్డి, మరికొందరు దాడిచేసి గాయపరిచారంటూ టీడీపీకి చెందిన ధనుంజయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు రామలింగారెడ్డి, హేమాద్రిరెడ్డితో పాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టారు. ఇది కొట్టేయాలని కోరుతూ రామలింగారెడ్డి, హేమాద్రిరెడ్డిలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జ్యోతిర్మయి విచారణ జరిపారు.

**ఎస్సీ, ఎస్టీ కేసు చెల్లదు..**

పిటిషనర్ల తరపు న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే పిటిషనర్లపై తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గొడవ జరిగితే, దానిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేయడం చెల్లదన్నారు. పైగా.. బాధితుడు ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన వ్యక్తి అయితేనే ఆ చట్టం కింద కేసు పెట్టడానికి వీలుంటుందన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో పాల్గొనకుండా చేసేందుకే పిటిషనర్లపై పోలీసులు ఈ తప్పుడు కేసు నమోదుచేశారన్నారు. అనంతరం.. పోలీసుల తరపున పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ వ్యవహారంలో లోతుగా విచారణ జరపాల్సి ఉందన్నారు. ఉప ఎన్నికను దృష్టిలో పెట్టుకుని పిటిషనర్లపై తదుపరి విచారణ వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణను ఈనెల 13కి వాయిదా వేశారు. ఈలోపు ఫిర్యాదుదారు ధనుంజయకు నోటీసులు అందజేయాలని పీపీకి సూచించారు.

## సరుకు రవాణాకు..
## లాజిస్టిక్స్ కార్పొరేషన్

-మొదటిపేజీ తరువాయి

శాటిలైట్ టౌన్‌షిప్పులను అభివృద్ధి చేయాలి. దీనివల్ల కొత్తగా మరిన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. తద్వారా సంపద సృష్టి జరుగుతుంది. ఈ తరహా సమీకృత అభివృద్ధి ఎక్కడెక్కడ చేయగలమో.. ఏవిధంగా చేయగలమో బ్లూ ప్రింట్ సిద్ధం చేసుకోవాలి. ఇదే సమయంలో సరుకు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్డు, రైలు, ఎయిర్‌కార్గో, ఇన్‌ల్యాండ్, మారిటైం కార్గోలకు మన రాష్ట్రమే కేంద్రంగా ఉండాలి. తక్కువ వ్యయమయ్యే మార్గం ద్వారా సరుకులను రవాణా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఉత్తర-దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లాలంటే మన రాష్ట్రమే కేంద్రం. ఇలాంటి పరిస్థితుల్లో మన వద్ద అన్ని రకాల సరుకు రవాణా మార్గాలు అందుబాటులో ఉంటే.. అభివృద్ధి వేగంగా జరుగుతుంది. పోర్టులు, ఎయిర్‌పోర్టులకు అనుసంధానంగా నేషనల్ హైవే కనెక్టివిటీ, రైల్ కనెక్టివిటీ ఉండేలా చూసుకోవాలి. కేంద్రం వద్ద నేషనల్ హైవేలకు, రైల్వే మార్గాలకు నిధుల కొరత లేదు. మనం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రతిపాదనలు పంపితే ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. దీనిని మనం సద్వినియోగం చేసుకోవాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**మౌలిక సదుపాయాల చోదకశక్తిగా..**

రాష్ట్రంలో వివిధ మార్గాల ద్వారా చేపట్టే సరకు రవాణాను సమర్థంగా నిర్వహించేందుకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. ఇది గ్రోత్ ఇంజన్ మాదిరిగా ఉండాలని తెలిపారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల సమీపంలో శాటిలైట్ టౌన్ షిప్పుల అభివృద్ధికి సంస్థలను గుర్తించి పీపీపీ విధానంలో చేపట్టాలని సూచించారు. ఇదే తరహాలో 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసుకుంటున్న ఎంఎస్ఎంఈ పార్కుల వద్ద కూడా శాటిలైట్ టౌన్‌షిప్పులను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేయాలి. కుప్పం, దగదర్తి విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలి' అని చెప్పారు.

**క్రూయిజ్ టెర్మినళ్లు..**

పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు వీలుగా మారిటైం విధానంలో మార్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పోర్టులు, టెర్మినల్స్, షిప్ బిల్డింగ్ యూనిట్లు, అంతర్గత జల రవాణా మార్గాలు, క్రూయిజ్ టెర్మినళ్ల ఏర్పాటుకు మార్గం సుగమం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న షిప్ బిల్డింగ్ క్లస్టర్ స్కీం పాలసీలో మార్పులు చేసుకోవాలని అధికారులు చెప్పారు. ఇందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. మచిలీపట్నం, మూలపేట, చినగంజాం వంటి ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు కొన్ని సంస్థలు ముందుకొచ్చాయని అధికారులు తెలిపారు. దీనిపై సీఎం స్పందించారు. 'షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఎక్కడ అనువుగా ఉందో చూడాలి. స్థానిక మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా చూడాలి. కంటైనర్ పోర్టుల ఏర్పాటు, అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలి' అని స్పష్టం చేశారు.

**డ్రోన్ల పర్యవేక్షణతో రౌడీషీటర్లలో వణుకు పుట్టించాలి**

డ్రోన్ల పర్యవేక్షణతో రౌడీషీటర్లలో వణుకు పుట్టించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్‌టీజీఎస్)ని ఆయన సందర్శించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సిద్ధం చేసిన ఆన్‌లైన్ పోర్టల్ 'అవేర్' డ్యాష్ బోర్డు 2.0ను ప్రారంభించారు. జలాశయాల్లోని నీటి నిల్వలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని కూడా తిలకించారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జీరో మలేరియా లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ పనిచేయాలన్నారు.

మా కలం - సామాజిక బలం RNI No: APTEL/2020/1906
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఇక కొత్త ఆదాయ పన్ను చట్టం

న్యూఢిల్లీ

ఆదాయ పన్ను (ఐటీ) చట్టం మరింత సులభతరంకానుంది. ఇందుకోసం ఆదాయ పన్ను బిల్లు, 2025 పేరుతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బిల్లును లోక్‌సభ సోమవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. పన్ను చెల్లింపుదారుల oదరికీ సులభంగా అర్థమయ్యేలా ఈ బిల్లును రూపొందించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. రాజ్యసభ ఆమోదం తర్వాత రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తే వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ బిల్లు 'ఆదాయ పన్ను చట్టం, 2025' పేరుతో అమల్లోకిరానుంది. ఈ బిల్లులోని ప్రధానాంశాలు ఏమిటంటే..



**రిఫండ్స్‌పై ఊరట..**

కొత్త ఐటీ చట్టంలో ఆలస్యంగా ఐటీ రిటర్న్‌లు దాఖలు చేసే వారికి రిఫండ్స్ రద్దు చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే అలాంటిదేమీ లేకుండా ఆలస్యంగా రిటర్న్‌లు ఫైల్ చేసే వారికీ రిఫండ్స్‌ను అనుమతించబోతున్నారు. అనారోగ్యం, సాంకేతిక సమస్యలతో సకాలంలో ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయలేని వారికి ఇది పెద్ద ఊరట కానుంది. ఇక టీడీఎస్ చెల్లింపుదారులకూ కొత్త ఐటీ చట్టం ఊరట కల్పించనుంది. ఈ వివరాలు ఆలస్యంగా ఫైల్ చేసినా జరిమానాలు ఉండవు. అలాగే టీడీఎస్ చెల్లింపు భారం లేని పన్ను చెల్లింపుదారులు ముందుగానే 'నిల్ టీడీఎస్' సర్టిఫికెట్ పొందేందుకూ అవకాశం లభించనుంది.

**కమ్యూటెడ్ పెన్షన్‌పై..**

ప్రస్తుతం ఉద్యోగులకు కమ్యూటెడ్ పెన్షన్‌పై పన్ను మినహాయింపు సదుపాయం ఉంది. ఇప్పుడు ఈ ప్రయోజనాన్ని ఉద్యోగేతరులకూ విస్తరించబోతున్నారు. ఎల్ఐసీ పెన్షన్ ఫండ్ వంటి ప్రత్యేక ఫండ్స్ నుంచి ఒకేసారి ఏక మొత్తంలో పెన్షన్ అందుకునే వారికీ ఈ ప్రయోజనం లభిస్తుంది.

**ప్రాపర్టీ ట్యాక్స్‌పై స్పష్టత**

గృహ ఆస్తుల ఆదాయం పన్ను మదింపుపైనా కొత్త చట్టంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. మునిసిపల్ ట్యాక్స్‌లు పోగా వచ్చే వార్షిక ఆదాయం నుంచి 30 శాతాన్ని స్టాండర్డ్ డిడక్షన్‌గా అనుమతిస్తారు. ఇల్లు కొనేందుకు, నిర్మించేందుకు లేదా మరమ్మతు చేయించేందుకు చేసిన అప్పులపై చెల్లించే వడ్డీకి కూడా గృహ యజమానులు ఈ ఆదాయం నుంచి డిడక్షన్ పొందవచ్చు. గృహాస్తి మొత్తాన్ని లేదా కొంత భాగాన్ని మాత్రమే అద్దెకు ఇస్తే.. సముచిత లేదా వాస్తవ అద్దె ఆదాయం.. ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే దాన్ని మాత్రమే గృహాస్తి ఆదాయంగా పరిగణిస్తారు. కాగా, కొత్త చట్టంలో ప్రస్తుత ఆదాయ శ్లాబులు యథాతథంగా ఉండనున్నాయి.

# పదిలో ముగ్గురే గ్రాడ్యుయేట్లు!

పదిలో ముగ్గురే.. అవును మీరు చదువుతున్నది నిజమే. దేశంలో పది మంది యువతలో ముగ్గురు మాత్రమే డిగ్రీ, ఆపై వరకు చదువుకున్నారు. మిగిలిన వారంతా ఇంటర్/డిప్లొమాకే పరిమితమవుతున్నారు. దేశంలో 15%–%29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత సుమారు 42 కోట్ల మంది ఉన్నారు. మొత్తం జనాభాలో వీరి వాటా దాదాపు 29%. వీరిలో సుమారు కోటికిపైగా నిరక్షరాస్యులు ఉన్నారు. ఒక వ్యక్తి ఆలోచనలను తీర్చిదిద్దడంలో సహాయపడే కీలక అంశాల్లో విద్య ఒకటి. ముఖ్యంగా యువత.. దేశంలో ఉత్పాదక శక్తులుగా, విలువైన మానవ వనరులుగా, వినూత్న పౌరులుగా మారడానికి వీలు కల్పించే ఆయుధం కూడా అదే. అలాంటి విద్య.. ప్రత్యేకించి ఉన్నత విద్య మనదేశంలో ఇప్పటికీ గ్రామీణులకు అందని ద్రాక్షలానే ఉంది. అక్షరాస్యత స్థాయిలు స్థిరంగా పెరుగుతున్నప్పటికీ దేశవ్యాప్తంగా సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్న విద్య నాణ్యత ఇప్పటికీ ఆశించిన స్థాయిలో లేదని 'పీపుల్ రీసెర్చ్ ఆన్ ఇండియాస్ కంజ్యూమర్ ఎకానమీ' (పీఆర్ఐసీఈ) విడుదల చేసిన 'నావిగేటింగ్ ది యూత్ ఫ్రాంటియర్' అనే పరిశోధనా పత్రం వెల్లడించింది. ఈ విషయంలో పట్టణాలకు, పల్లెలకు మధ్య అసమానత స్పష్టంగా కనిపిస్తోందని తెలిపింది.



**ఉన్నత చదువులు పట్టణాలకే..**

దేశవ్యాప్తంగా 2024%–%25 నాటికి మొత్తం యువతలో 24% మంది.. అంటే సుమారు 9.9 కోట్ల మంది డిగ్రీ పూర్తి చేశారు. వీరిలో గ్రామీణ ప్రాంతాల వారి వాటా 52 శాతం. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా దాదాపు 3 కోట్ల మంది అందుకున్నారు. వీరిలో 66 శాతం పట్టణవాసులే కావడం గమనార్హం. ఇతర ఉన్నత చదువులు చదివిన 20 లక్షల మంది యువతలో పట్టణ ప్రాంతాలవారు ఏకంగా 85 శాతం ఉన్నారు. అంటే ఉన్నత చదువులు పట్టణాలకే పరిమితం అవుతున్నట్టు స్పష్టం అవుతోంది. మొత్తం యువతలో ప్రాథమిక విద్య అభ్యసించిన వారు 7.3 కోట్లు (17%), మెట్రిక్ 7.6 కోట్లు (18%), ఇంటర్ 9.3 కోట్లు (22%), టెక్నికల్/డిప్లొమా చేసినవారు 3.6 కోట్లు (9%) ఉన్నారు. యూత్‌లో 3% అంటే 1.3 కోట్ల మంది నిరక్షరాస్యులుగా మిగిలిపోయారు. ప్రాంతాలవారీగా చూస్తే డిగ్రీ, ఆపై చదువులు చదివిన వారు దక్షిణాది రాష్ట్రాల్లో అధికంగా ఉన్నారు.

# కదం తొక్కిన విపక్షం

న్యూఢిల్లీ

ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు కదం తొక్కారు. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ.. సోమవారం నిరసన చేపట్టారు. పార్లమెంట్ భవనం నుంచి ఈసీ కార్యాలయం దాకా ఎంపీలు ప్రదర్శన చేపట్టగా.. వారిని ఢిల్లీ పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు నేతలు బారికేడ్లు ఎక్కి ముందుకెళ్లే యత్నం చేయడం, పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇద్దరు మహిళా ఎంపీలు కళ్లుతిరిగి పడిపోయారు. ఎంపీల శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పలువురు నేతలు మండిపడ్డారు. సోమవారం ఉదయం పార్లమెంట్ సమావేశం కాగానే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలి.. ఓట్ల చోరీని నిలిపివేయాలి అని నినాదాలు చేస్తూ ప్రతిపక్ష సభ్యులు ఉభయ సభలను స్తంభింపజేశారు. దీంతో సభలు వాయిదా పడ్డాయి. అనంతరం ఉభయ సభలకు చెందిన దాదాపు 300 మంది ఇండియా కూటమి ఎంపీలు అక్కడి నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా బయలుదేరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ఎంపీ ప్రియాంకగాంధీ, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్, ఎన్సీపీ–ఎస్పీ నేత శరద్‌పవార్, శివసేన నేతలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది, డీఎంకే నేత టీఆర్ బాలు, తృణమూల్ నేత డెరెక్ ఒబ్రెయిన్ సహా ఆర్జేడీ, లెఫ్ట్, ఆప్ నేతలు సైతం ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై బీజేపీని గెలిపిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ మకర ద్వారం నుంచి బయలుదేరి ప్రదర్శనగా వెళుతుండగా.. పోలీసులు అడుగడుగునా బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు.





**బారికేడ్లు ఎక్కి నినాదాలు..**

సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మహిళా ఎంపీలు మహువా మోయిత్రా, సంజనా జాదవ్, జ్యోతిమణి, ఎన్సీపీ నేత సుప్రియా సూలే.. బారికేడ్ల పైకెక్కి ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ.. నిరసన జరిగినంతసేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ వాద్రా, అఖిలేశ్ యాదవ్, సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది సహా పలువురిని పోలీసులు బస్సుల్లోకి ఎక్కించి పార్లమెంట్ వీధిలో ఉన్న పోలీసస్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత కొద్దిసేపటికి విడుదల చేశారు. కాగా, 30 మంది ఎంపీలను కలుసుకునేందుకు మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని, కానీ.. 200 మందికి పైగా నేతలు ర్యాలీలో పాల్గొన్నారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ దేవేశ్‌కుమార్ మహా తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు వారిని నిలువరించి నిర్బంధించాల్సి వచ్చిందన్నారు. బారికేడ్లు దాటి ముందుకెళ్లే ప్రయత్నంలో పోలీసులతో ఘర్షణ పడిన తృణమూల్ ఎంపీలు మహువా మోయిత్రా, మిథాలీ బాగ్ స్పృహ తప్పి పడిపోయారు. వారికి రాహుల్‌గాంధీ సాయం అందించడంతో మహువా తేరుకున్నారు. మిథాలీ తేరుకోకపోవడంతో ఆమెను లోహియా ఆస్పత్రికి తరలించారు.

**రాజకీయ యుద్ధం కాదు..**

తమది రాజకీయ పోరు కాదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు చేస్తున్న యుద్ధమని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఓట్లను కొల్లగొట్టి బీజేపీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై తాము పోరాడుతున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్‌తో తాము మాట్లాడలేకపోతున్నామనేది వాస్తవమని, తమకు స్వచ్ఛమైన, నిజమైన ఓటర్ల జాబితా కావాలని డిమాండ్ చేశారు. ఒకే వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న దానిపై తాము పోరాడుతున్నామని, వాస్తవాలను దేశ ప్రజలకు తెలియజేశామని పేర్కొన్నారు. కాగా, ఓట్ల చోరీపై తాము శాంతియుతంగా ప్రదర్శన చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతోందో తెలియడం లేదని ఖర్గే అన్నారు. మరోవైపు రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ జవాబు ఇవ్వకుండా.. ప్రమాణం చేయడాలనడం విడ్డూరమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. పోలీసులతో నిర్బంధించడం ద్వారా ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

## నేడే పార్లమెంట్ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ

పార్లమెంటు ఉభయ సభలను మంగళవారం నిరవధికంగా వాయిదా వేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వర్షాకాల సమావేశాలను ఈ నెల 21 వరకు కొనసాగించాలని కేంద్రం ముందుగా నిర్ణయించినా.. వారం రోజుల ముందే వాయిదా వేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (ఎస్ఐఆర్), దేశవ్యాప్తంగా ఓట్ల చోరీపై ప్రతిపక్షాల నిరసన ఉధృతం కావడం, గత మూడు వారాలుగా ఉభయ సభలు స్తంభించిపోవడంతో ఆత్మరక్షణలో పడిన కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సోమవారం ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లడంతో.. కీలకమైన బిల్లులను ఎన్డీయే భాగస్వామ్య పార్టీల మద్దతుతో ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అత్యంత కీలకమైన జాతీయ క్రీడా పాలనా బిల్లు, జాతీయ యాంటీ డోపింగ్ (సవరణ) బిల్లు, ఆదాయ పన్ను బిల్లు వంటి వాటిని లోక్‌సభ ఆమోదించింది. మరోవైపు రాజ్యసభలో మర్చంట్ షిప్పింగ్ బిల్లు, గోవాలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్టీ ప్రాతినిధ్యాన్ని సవరించే బిల్లును ఆమోదించారు. కాగా, సమైక్య పింఛన్ పథకం చందాదారులకు పన్ను మినహాయింపులు కల్పిస్తూ పన్ను చట్టాలను, ముఖ్యంగా ఆదాయ పన్ను బిల్లును సవరిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బిల్లును ప్రవేశ పెట్టారు. దీనిపై కొంతసేపు చర్చ జరిగిన అనంతరం సభను వాయిదా వేశారు. ఇక జాతీయ క్రీడాపాలనా బిల్లు, యాంటీ డోపింగ్ సవరణ బిల్లును మధ్యాహ్నం 2గంటల తర్వాత వరుసగా ఈ బిల్లులను ప్రవేశపెడుతూ.. ఒకదాని తర్వాత మరొకటి ఆమోదిస్తూ వచ్చారు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఆదాయపన్ను బిల్లు, పన్ను చట్టాల సవరణ బిల్లును ఆమోదించగానే సభను మంగళవారానికి వాయిదా వేశారు

## సైబర్ మోసాలపై కేంద్రం నజర్



న్యూఢిల్లీ

ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు.. సైబర్ మోసాల కట్టడిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. సైబర్ కేటుగాళ్లల నేరాలకు ఉపయోగించే సిమ్‌కార్డులను తక్షణమే బ్లాక్ చేసే అధికారాలను జిల్లా స్థాయిలో ఎస్పీలకు దఖలుపరచాలని నిర్ణయించినట్లు వివరించారు. కేటుగాళ్ల లొకేషన్లు, బ్యాంకింగ్, టెలికాం సోర్సుల వివరాలను దేశంలోని అన్ని పోలీసస్టేషన్లకు అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలోని తన కార్యాలయంలో 14సీ (భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రం) ఆధ్వర్యంలో అమల్లోకి తీసుకొచ్చిన సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ కమాండో ప్రోగ్రామ్‌పై హోంశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాల మ?ధ్య సమన్వయానికి 'సమన్వయ్ ప్లాట్‌ఫాం' దోహదపడుతుందని అధికారులు బండి సంజయ్‌కి వివరించారు. దీనిపై సంజయ్ మాట్లాడుతూ.. గ్రామగ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇందుకోసం తెలంగాణ ను పైలట్‌ప్రాజెక్టుగా తీసుకున్నట్లు చెప్పారు. త్వరలో తెలంగాణలో ఒక రోజంతా సెమెనార్‌ను ఏర్పాటు చేస్తామన్నా రు. సైబర్ నేరాలపై అవగాహన ఉన్న హోంగార్డు మొద లు, ఎస్పీస్థాయి అధికారితో కలిపి.. ఒక్కో జిల్లా నుంచి 10 మందిని ఎంపిక చేసి, వారికి అవగాహన కల్పిస్తామన్నారు. వీరంతా టీచర్లు, న్యాయవాదులు, ఇంజనీర్లు, డాక్టర్లు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు.. ఇలా వివిధ రంగాల వారి కోసం సెమినార్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ బృందాలు గ్రామ స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తాయన్నారు.

## ఎస్పీజీలో తొలి మహిళా ఆఫీసర్.. ఎవరీ అదాసో కపేసా?

**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత పొందే ఏకైక వ్యక్తి ప్రధాని మోదీ. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ ఆయన్ను అనుక్షణం కంటికిరెప్పలా కాపాడుతుంది. ఇటీవల మోదీ బ్రిటన్ పర్యటనలో భాగంగా ఓ ఫొటో వైరలైంది. ప్రధాని వెనుకాల ఉన్న మహిళా ఎవరనే విషయం ఆసక్తిగా మారింది. ఆమె పేరు అదాసో కపేసా ఎస్‌పీజీలో తొలి మహిళా ఆఫీసర్‌గా ఘనత సాధించారు. ఆమె గురించి కొన్ని విశేషాలివీ..!



మణిపుర్ సేనాపతి జిల్లాలోని కైబీ గ్రామం అదాసో కపేసా స్వస్థలం. సశస్త్ర సీమా బల్ లో చేరిన ఆమె.. ఉత్తరాఖండ్ పిథోడ్‌గఢ్‌లోని 55వ బెటాలియన్‌లో సేవలందించే వారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిణి అయిన ఆమె ఎస్‌పీజీలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులోకి ప్రవేశించడం ఆషామాషీ వ్యవహారం కాదు. యుద్ధ మెలకువలు, వ్యూహాత్మక నిఘా, హై సెక్యూరిటీ ప్రొటోకాల్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే తీరు అంశాల్లో కచ్చితత్వం కనబర్చిన కపేసా ఇందులో అడుగుపెట్టారు. కఠినమైన ప్రమాణాలతో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భద్రతాదళాల్లో ఒకటిగా పేరుపొందిన ఎస్‌పీజీ బృందంలో కపేసా ప్రవేశించడం వ్యూహాత్మకం, చరిత్రాత్మకంగానూ భావిస్తున్నారు. ముఖ్యంగా భద్రతా బలగాల్లో స్త్రీ, పురుష భేదం లేదని నిరూపించే ప్రయత్నం చేశారు. 1985లో ఎస్‌పీజీ ఏర్పాటైనప్పటి నుంచి ఓ మహిళా అధికారిణి ఇందులో విధులు నిర్వర్తించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రధాని బ్రిటన్ పర్యటనలో కపేసా విధుల్లో ఉండటంతో ఆమెపై సోషల్ మీడియాలో ప్రశంసలు కురిశాయి. ఆమె సరికొత్త ఘనత సాధించారని, శక్తికి ప్రతిరూపంగా, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారంటూ నెటిజన్లు స్పందించారు.

## 2024-25 ఆర్థిక సంవత్సరంలో.. 2.17 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు గుర్తింపు

**న్యూఢిల్లీ:** 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ డినామినేషన్లకు చెందిన 2.17 లక్షలకు పైగా నకిలీ కరెన్సీ నోట్లను గుర్తించారు. ఇందులో 1.17 లక్షలకుపైగా కొత్త రూ.500 నకిలీ నోట్లు ఉన్నాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2.23 లక్షలకుపైగా నకిలీ నోట్లను గుర్తించినట్లు తెలిపారు. అయితే 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ డినామినేషన్లకు చెందిన 2.17 లక్షలకు పైగా నకిలీ నోట్లు బయటపడినట్లు చెప్పారు. ఇందులో అత్యధికంగా కొత్త రూ.500కు చెందిన 1,17,722 నకిలీ నోట్లు ఉన్నాయని అన్నారు.

# స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శ్రీకాళహస్తిలో వామపక్షాల ధర్నా





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి పట్టణంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించబడింది. శ్రీకాళహస్తి టౌన్ రూరల్ ఏడి కార్యాలయం ముందు ఈ ధర్నా జరిగింది. ధర్నాలో భాగంగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు ఆర్థికంగా భారంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో స్మార్ట్ మీటర్ ధర తొమ్మిది వేల రూపాయలు ఉంటుందని, ఈ ఖర్చును కూడా వినియోగదారులే భరించాల్సి వస్తుందని, దీనిని బిల్లులో సర్దుబాటు చేస్తారని తెలిపారు. మొబైల్ రీఛార్జ్ చేసినట్లుగా కరెంటు రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, పగలు ఒక ఛార్జీ, రాత్రి ఒక ఛార్జీ విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులను మోసం చేసి ఆదాని సంస్థకు లబ్ధి చేకూరుస్తున్నాయని ఆరోపించారు. వినియోగదారుల అనుమతి లేకుండా కరెంటు డిపార్ట్మెంట్ వారు స్మార్ట్ మీటర్లు బిగిస్తే 100 నంబర్ కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసే హక్కు వినియోగదారులకు ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జనమాల గురవయ్య, రొద్ద గోపి, మించల శివకుమార్, శ్రీనివాసులు, చారులత, మునిరాజా, జనార్దన్, మురళి, సిపిఎం పార్టీ నాయకులు అంగెరి పుల్లయ్య, గంధం మనీ, గురవయ్య, రాపూర్ సుబ్రహ్మణ్యం మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు శిక్షణ కార్యక్రమం

## సమగ్ర యాజమాన్యం రైతుకు లాభదాయకం





స్వర్ణసాగరం ప్రతినిధి రమేష్ డక్కిలి

డక్కిలి మండలం డక్కిలి గ్రామమునందు పీఎం ఆర్కే వి వై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారిచే రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమములో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ, కేవలం రసాయన ఎరువులు అనే వాడకుండా, రసాయన ఎరువులతో పాటు,సేంద్రియ ఎరువుల ను, సమతుల్యములో వాడడం మరియు కేవలం పురుగుమందులు నే వాడకుండా జీవ శిలింద్రనాశనలను, లింగాకర్షక బుట్టలను జిగురు అట్టల వంటి వాటిని వాడుతూ పురుగుమందులను తగ్గించుకున్నట్లయితే, రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో డక్కిలి మండల వ్యవసాయ అధికారి శిరీష మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మరియు పంటల బీమా పథకం గురించి వివరించారు. , ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, శ్రీనివాస్, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవిప్రసాద్ మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కోటలో ఆధార్ కేంద్రంను ప్రారంభించిన ఎంపీడీవో వేణు



కోట స్వర్ణసాగరం ఆగష్టు 11

కోట మండల కార్యాలయాల సముదాయంలో ఉన్న స్త్రీ శక్తి భవనంలో సోమవారం నాడు ఎంపీడీఓ వేణు ఆధార్ కేంద్రం ను ప్రారంభించారు.ఈసందర్భంగా ఎంపీడీఓ వేణు మాట్లాడుతూఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఆధార్ కేంద్రంలో గిరిజనులకు పూర్తి స్థాయిలో ఆధార్ నమోదు చేసి వారికి ఆధార్ కార్డులు అందించడం ముఖ్య ఉద్దేశంగా చెప్పారు.గ్రామీణ ప్రాంతాలలో నివసించే గిరిజనులు అవగాహన లోపంతో ఇప్పటి వరకు జనన ధ్రువీకరణ పత్రాలు లేక ఆధార్ పొందలేకున్నారని స్థానికంగా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని వారికి తహసీల్దార్ పరిశీలించి ధ్రువీకరించి ఇచ్చిన ధ్రువపత్రంతో ఆధార్ నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాలు పొందేందుకు వీలుగా ఉంటుంది అని ఎంపిడిఓ వేణు తెలిపారు.తీర ప్రాంతంలో నివసించే ఆధార్ కార్డులు లేని గిరిజన ప్రజలు ఆయా సచివాలయంలో తమ పేర్లు నమోదు చేసుకున్నట్లయితే ఆ సచివాలయం పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆధార్ కార్డు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ ఆధార్ కేంద్రంలో ఆధార్ కి సంబంధించి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని ఆధార్ కార్డులోని కొన్ని సవరణలు కొరకు సరైన ధ్రువపత్రాలు సమర్పించి సరిచేసుకోవచ్చునని తెలిపారు.మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ ఆధార్ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన గూడూరు శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆధార్ కేంద్రం ఆపరేటర్ మసూద్,తెలుగుదేశం పార్టీ తిరుపతిజిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి,కోట ఎంపీటీసీలు దారా సురేష్,షేక్ శంషుద్దీన్,వెంకన్నపాలెం సర్పంచ్ కోకర్ల మధు యాదవ్ ఉన్నారు.

# ఆగస్టు 12 నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



ఐరాల, ఆగస్ట్ 11 స్వర్ణ సాగరం

ఐరాల, ఆగస్టు 12వ తారీఖున జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఐరాల ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప పిహెచ్సి పరిధిలోని పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాలలో నులిపురుగుల నివారణ గూర్చి ఉపాధ్యాయులకు అంగన్వాడీ టీచర్లకు తెలియజేయనున్నారు . మొత్తం ఐరాల పిహెచ్సి పరిధిలో 44 అంగన్వాడి కేంద్రాలు 32 ఎంపీపీ స్కూలు, మూడు హైస్కూల్లో ఉన్నట్లు గుర్తించి వారికి సరిపడినన్ని ఆల్బెండజోల్ మాత్రలు సప్లై చేయడం జరిగింది ఒకటి నుంచి రెండు సంవత్సరాలు వారికి సగం మాత్ర రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వారికి పూర్తి మాత్రను భోజనం చేసిన తర్వాత అందించాలని వివరించారు . ప్రతి పాఠశాల మరియు అంగన్వాడీ కేంద్రాలలో మొబైల్ నెంబర్ ఇవ్వడం జరిగింది. ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం వలన పిల్లలలో రక్తహీనతను అరికట్టవచ్చును, పిల్లల ఎదుగుదలని మెరుగుపరచవచ్చును, ఆరోగ్యవంతమైన నేటి విద్యార్థులు రేపటి పౌరులు కావున వారి యొక్క ఆరోగ్యం మనం బాధ్యతగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు వైద్య సిబ్బంది దానికి అనుగుణంగా కృషి చేయాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎమ్స్, ఎం ఎల్ హెచ్ పిలు, సూపర్వైజర్ స్టాప్ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ రెడ్డప్ప పిలుపునిచ్చారు.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన



స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి ఆగస్టు 11 :-

మధ్వ మత ఆరాధ్య గురువు, కలియుగంలో కోరిన కోరికలు తీర్చే శ్రీ రాఘవేంద్ర స్వామి వారు శ్రావణ బహుళ విదియ రోజు శరీరముతో బృందావన ప్రవేశం చేసిన పరమ పుణ్య రోజు మండల పరిధిలోని తీర్థం గ్రామంలో వెలసిన ఈ రాఘవేంద్ర స్వామి ఆలయంలో మూలవర్లకు అర్చకులు రమేష్ ఆచార్యులు పంచామృత అభిషేకములు జరిపి సుగంధ పుష్పాలతో స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి ప్రాకారోత్సవం జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉడిపి గోపాలాచార్యులు చెప్పిన ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీ గురు రాజా సేవా సమితి సభ్యులు మురలీధర్ రావు, మోహన్, శ్రీనివాసమూర్తి ,ఆనందరావు, సుబ్బన్న, మధుసూదన్, సుంద రేష్ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 38వ జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఎన్ వి ఆర్ గార్డెన్ హై స్కూల్ విద్యార్థులు







నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 11

మహారాష్ట్ర లోని షిర్డీ లో 22బి08బి2025 నుంచి 25బి08బి2025 వరకు జరిగే జాతీయ స్థాయి జూనియర్ %సబ్ జూనియర్ టీం మరియు మిక్స్ ఈవెంట్స్ టగ్ ఆఫ్ వార్ పోటీలకు అనుబంధం గా 10బి08బి2025 న నెల్లూరు జిల్లా వింజమూరు లోని శ్రీ సాయి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ నందు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనపరిచిన జడ్పీ హై స్కూల్ ఎన్.వి గార్డెన్స్ విద్యార్థులు 1.పుష్పగిరి. జాన్ విక్టర్ బి10 వ తరగతి

2. ఎంబేటి ఎల్లమ్మ 7 వ తరగతి
3.రేగళ్ల.సుశీలబి7వ తరగతి
4.ఎంబేటి ధరణి ..6వ తరగతి

..విద్యార్థులు ఎంపికయ్యారు..వీరితో పాటు స్కూల్ పూర్వ విద్యార్థి రేగల్ల శ్రీ హర్షిత కూడా ఎంపికయ్యింది .వీరు జాతీయ స్థాయిలో జరిగే టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొంటున్నట్లుఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సెక్రెటరీ స్వీటీవందన తెలియజేశారు

# మంత్రి నాదెండ్ల మనోహర్ కు ఘన స్వాగతం పలికిన ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్



స్వర్ణసాగరం (నాయుడుపేట)ఆగష్టు 11

జనసేన పార్టీ పిఏసి చైర్మన్,రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు సోమవారం రేణిగుంట ఎయిర్ పోర్ట్ వద్ద సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఘన స్వాగతం పలికారు.రైల్వే కోడూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్ ను రేణిగుంట ఎయిర్ పోర్ట్ వద్ద ఉయ్యాల ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ కు ఉయ్యాల ప్రవీణ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

స్వర్ణసాగరం



# కాణిపాక స్వామివారి నిత్య అన్నదానం కి విరాళం



కాణిపాకం, ఆగస్ట్ 11స్వర్ణ సాగరం

కాణిపాక స్వామివారి నిత్య అన్నదానానికి విరాళం.కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానమునకు విరాళం 1,00,116 రూపాయలు, దాత శైలజా రెడ్డి , మదనపల్లి వాస్తవ్యులు, ఆలయ అధికారులు వీరికి దర్శన ఏర్పాట్లు చేసి అనంతరం ఆశీర్వాదం మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం చేయించి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, తదితరులు ఉన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీని సహచర ఎంపీలతో కలిసి..

# శ్రీవారి ప్రతిమను అందజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ



ఢిల్లీ:( శ్రీరంగరాజపురం): స్వర్ణ సాగరం (ఆగస్టు 11)

ప్రధాని నరేంద్ర మోడీని ఢిల్లీ లోని దేశ రాజధానిలో సోమవారం కేంద్ర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ఎంపీల బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించి రాష్ట్ర అభివృద్ధికి దోహధపడుతున్న ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సహచర ఎంపీలతో కలిసి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ప్రధాని నరేంద్ర మోడీని ఘనంగా సత్కరించి, తిరుమల శ్రీవారి ప్రతిమను అందజేశారు. ఆపరేషన్ సిందూర్ ఘన విజయం పై ప్రధాని మోడీకి అభినందనలు తెలియజేశారు. అలాగే భారతదేశ ప్రతిష్టను ప్రపంచ దేశాలలో ఇనుమడింపజేస్తున్న నరేంద్ర మోడీ వెంటే తాము నడుస్తామని.., ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ...దేశ సేవకు అంకితమవుతామని నినదించారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు. వీరిని ప్రధాని అభినందించారు.

# తెలుగుదేశం పార్టీ సత్తా చాటిన తోటపల్లి గూడూరు గౌడ నేతలు



తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం ఆగస్టు 11

మండలంలోని టిడిపికి చెందిన గౌడ నేతలు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గౌడ సంక్షేమానికి చేస్తున్న కృషిని వివరించారు తాము టిడిపి ప్రభుత్వానికి నిరంతరం తమ అండదండలు అందిస్తామని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గణాంకాలతో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొణతం రఘుబాబు టిడిపి ప్రధాన కార్యదర్శి గౌడ నేత మన్నెంజితేంద్రమన్నెంమధుసూదన్ గౌడ్ రాము గౌడ్ మండల టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు

# గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

పూతలపట్టు స్వర్ణ సాగరం ఆగస్టు 11



గంజాయి కేసులో ముగ్గురిని ఈ రోజు మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో పూతలపట్టు పోలీసులు బండపల్లి బస్స్టాప్ వద్ద గంజాయి అక్రమంగా కలిగి ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయినవారు గేవేనమ్మ ఏం బండపల్లి గ్రామం పూతలపట్టు మండలం విగ్నేష్ వెల్లూరు మనోమారన్ నెల్లూరువారి వద్ద నుండి 1.1 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు అదే విధంగా రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు స్వాధీనం చేసుకున్న ఆస్తి మొత్తం విలువ సుమారు 2. 15000 అరెస్ట్ అయిన వారిని రిమాండ్కు పంపించగా పూతలపట్టు సిఐ కృష్ణమోహన్ కేస్ దర్యాప్తు చేస్తున్నారు ఈ కార్యక్రమంలో పూతలపట్టు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# "గౌడ సంక్షేమానికి టిడిపి "పెద్దపీట"

### ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి శాసనసభ్యులు చిత్రపటాలకు పాలాభిషేకం

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 11

గౌడ సంక్షేమానికి టిడిపి పెద్దపీట వేయడం జరిగిందని గౌడ నేతలు పేర్కొన్నారు. సోమవారం మాజీ ముఖ్యమంత్రి టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర హాజరైనారు టిడిపి ప్రధాన కార్యదర్శి గౌడ నాయకులు మన్నెంజితేంద్ర ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చిత్రపటాలకు గౌడ నేతలుపాలాభిషేకం జరిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చడంలో సఫలత చెందినట్లు వారు



పేర్కొన్నారు. గౌడ నేతలు కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ ఆకర్షణగా నిలిచిందితెలుగుదేశం జిందాబాద్ అంటూ చేసిన నినాదాలు హోరెత్తించాయి. మొత్తం మీద ఈ ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది

# నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం భారీ ర్యాలీ

నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 11

ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో = కాలేజీ గ్రౌండ్ నుండి 500 మంది ఆటో కార్మికులతో ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భారీ ప్రదర్శన నిర్వహించి, కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టి వి వి ప్రసాద్ మరియు ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు %ఖ% సురేష్,రాజా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం ట్రాన్స్పోర్ట్ రంగంపై మరియు ప్రజా రవాణా వ్యవస్థలో ప్రధానమైన ఆటో కార్మికులపై జీవో నెంబర్ 21 పేరుతో విపరీతమైన ఆర్థిక భారాలు మోపడం జరిగింది అంతేకాకుండా దీనిని రద్దు చేయాలని ఆటో కార్మికులు దశలు వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు అయినా కూడా ప్రభుత్వం దాన్ని కొనసాగించింది అలాగే ఇటీవల కాలంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి




ప్రభుత్వం ఓట్లు కోసం ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీల లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని ఈనెల 15వ తేదీ అమలు చేయడానికి సిద్ధమైంది ఇప్పటికే ఆర్థిక భారాలతో సతమతమవుతున్న ఆటో కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వలన వాళ్ళ యొక్క జీవితాలు మరింత దుర్భర పరిస్థి తుల్లోకి నెట్టి వేయబడతారని ఆందోళన వ్యక్తం చేశారు అంతేకాకుండా ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారం చేసి వాహన మిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి కార్మి కుడికి 25 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వకుండా ఆపాలని ఆర్టీఏ అధికారుల ద్వారానే ఫిట్నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తెలియజేశారు నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణా బాబురావు డి లవన్ కుమార్, నున్న సురేష్ రాధయ్య, పెంచలయ్య, రవీంద్ర శ్యాంసన్,ఎం సుధాకర్ విజయ్, హరి, దయాసాగర్, అశోక్, మరియు జిల్లా నలుమూలల నుండి 500 మంది ఆటో కార్మికులు పాల్గొని ర్యాలీ జయప్రదం చేశారు.

# కూటమిపాలనపై కాకాణిపూజిత విమర్శలు అర్థరహితం

### సర్వేపల్లి నియోజకవర్గంజనసేన పార్టీ సమన్వయ నేత సురేష్ నాయుడు విమర్శ



వెంకటాచలం ఆగస్టు 11

మాజీ మంత్రి కాకాణిగోవర్ధన్ రెడ్డి కుమార్తె వైసిపి మహిళ వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు కాకాణి పూజితమ్మటిడిపి ప్రభుత్వం పై చేసిన విమర్శలను ఖండించారు.టిడిపి 14 నెలల పాలనలోఅమలు చేసిన పథకాలను వివరించారు.ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం అందించడం జరుగుతుందని తెలిపారు.విమర్శలు సహేతుకంగా ఉండాలనిహితవు పలికారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు పొట్లూరు సుబ్రహ్మణ్యం సందూరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు

# రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం గా కృషి చేస్తాను

### రెండవసారి చిత్తూరు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తవణంపల్లి తహశీల్దార్ సుధాకర్

స్వర్ణసాగరం తవణంపల్లె ఆగస్టు-11



రెవిన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కృషి చేస్తానని చిత్తూరు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తవణంపల్లి తహశీల్దార్ సుధాకర్ తెలిపారు. చిత్తూరు రెవెన్యూ భవన్ నందు జరిగిన రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికల నందు ఆయన రెండవసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవ%శీ%గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తవణంపల్లి తహసిల్దార్ ఆఫీస్ లో ఉద్యోగులు ఆయనను కలిసి అభినందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులు అందరూ ఏకతాటి గా నిలిచి ఐక్యతను చాటారని , అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా రెవిన్యూ అసోసియేషన్, జిల్లా యంత్రాంగానికి మధ్యన వారధిగా నిలిచి రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానన్నారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావడానికి ఉద్యోగుల యొక్క పనితీరు ను ప్రామాణికంగా నిర్ణయించి వారి యొక్క పనితీరును పెంపొందించడానికి కృషిచేస్తానన్నారు. వచ్చే నెలలో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నందు క్రీడ పోటీలు జరగనున్నదని ఇందులో చిత్తూరు జిల్లా, జిల్లా పేరు నిలపడానికి రెవిన్యూ ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని నింపి ఇంతకు ముందులా మరిన్ని పథకాలను కైవసం చేసుకుంటామని ఆయన వివరించారు.

## జిల్లా వ్యాప్తంగా డ్రోన్ నిఘాతో భద్రతా వలయం బలోపేతం చేస్తున్న జిల్లా పోలీసులు.





చిత్తూరు, స్వర్ణ సాగరం, ఆగస్టు 11

అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ మరియు ఇంచార్జ్ అడ్మిన్ ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు ఆదేశాల మేరకు సంబంధిత సబ్-డివిజన్ డి.ఎస్పీ ల ఆధ్వర్యంలో డ్రోన్ ల తో, చిత్తూరు జిల్లా అంతటా నిర్మానుష్యమైన ప్రదేశాల్లో క్షుణ్ణంగా పరిశీలించి, సమీప ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డు కట్టు వేస్తున్న చిత్తూరు జిల్లా పోలీసులు.ఈరోజు డ్రోన్ నిఘా సందర్భంగా, చిత్తూరు %×% టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంబయ్యకండ్రిగలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు.

జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను కాపాడడంలో భాగంగా, చిత్తూరు పోలీసులు ఆధునిక డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా నిర్మానుష్య ప్రాంతాలు, పాడుబడిన భవనాలు, బహిరంగ ప్రదేశాలు వంటి నేరాలకు అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, చైన్ స్నాచింగ్, దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. నేర నియంత్రణలో భాగంగా క్రైమ్ ప్రోన్ ఏరియాలపై 24 గంటల పర్యవేక్షణ జరుగుతోంది.కావున ఎవరైన చట్ట వ్యతిరేక మరియు క్రిమినల్ చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పోలీసుల హెచ్చరికలు జారీ చేసారు.

# మండల టిడిపి పార్టీ అధ్యక్షుల ఎంపిక ప్రకటన ఆలస్యం.

- బహిరంగ వేలానికి సిద్ధం కండి..?
- త్వరలో తేదీ ప్రకటించబడును...?
- సమాయత్తం కండి నేతలారా...
- మార్పులు-చేర్పులు చేపట్టబడును..?
- మూట-ముడుపులు
- సర్దుకోవాల్సింది మీరే.. త్వర..పడండి...?
- నియోజకవర్గ నేతలు ప్రగల్భాలు..?





గంగాధర నెల్లూరు నియోజకవర్గం: (శ్రీరంగరాజపురం): స్వర్ణ సాగరం: (ఆగస్టు 11)

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో. మండలటిడిపి పార్టీ అధ్యక్ష ఎంపికల్లో(ప్రకటనలో) భారీ అవకతకులు జరిగాయని... (అభ్యర్థుల ప్రకటన ఆలస్యం కావడంతో) నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ వి ఎం థామస్... తీరు అంతు బట్టని విధంగా ఉండడంతో.. ఇప్పటికే గంగాధర నెల్లూరు నియోజకవర్గ నేతల్లో వర్గ పోరు తారాస్థాయికి చేరింది. దీంతో ఎమ్మెల్యే మొండి వైఖరి అవలంబించడంతో. . నియోజకవర్గ నేతలంతా కలిసి.. ఒకే రాగం.. పలుకుతుండడంతో ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఇందు మేరకు పార్టీ అధ్యక్ష ఎంపికను బహిరంగంగా వేలం ద్వారా నిర్వహిస్తే బాగుంటుందని... ఆపై అధిష్టానం పార్టీ (అబ్జర్వర్లు)ఒక తేదీ (అంటే వేలం)ప్రకటిస్తే... ఆ మేరకు మేము మూట. . ముడుపులు చెల్లించుకోవడానికి సిద్ధంగా ఉంటామని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తమ మనోభావాన్ని వెల్లడిస్తున్నట్లు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రస్తుతం ఎక్కడ చూసినా ఈ మాటలే వినిపిస్తోంది.

**నియోజకవర్గ సమీక్ష సమావేశంలో చేతులెత్తేసిన అబ్జర్వర్లు..**

గత వారంలో చిత్తూరు టిడిపి పార్టీ అధ్యక్ష భవనంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ అధ్యక్షతన నియోజకవర్గ ఆరు మండలాల టిడిపి పార్టీ అధ్యక్ష ఎంపికలు చేయడానికి అబ్జర్వర్ల సమక్షంలో మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని తానై ఎమ్మెల్యే అనుకున్న అభ్యర్థుల మేరకే సాహసం చేస్తున్నారని.. ఏకగ్రీవం చేసుకోవడానికి సయోధ్య కుదర్చడానికి ప్రయత్నం చేస్తున్నట్లు.. ప్రతి మండల పార్టీ అధ్యక్ష ఎంపికకు హాజరైన నేతలు మనోభావం. గత సాధారణ ఎన్నికల్లో ప్రతి మండలంలో, ప్రతి పంచాయతీలో తమ తమ పాత్ర పోషించి ఎమ్మెల్యే విజయానికి కృషి చేశామని తెలుపుతున్నారు. కానీ మా మనోభావం దెబ్బతినేటట్లుగా ఎమ్మెల్యే తీరు ఉందని.. పార్టీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్న అసమ్మతి నేతలు వాపోతున్నారు.

**పాత సీసాలో... కొత్త సారా అన్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఎంపిక...**

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆరు మండలాల్లో... గంగాధర నెల్లూరు మండలానికి ప్రస్తుత అధ్యక్షుడు స్వామి దాస్, సీనియర్ మాజీ పార్టీ అధ్యక్షుడు దేవ సుందరం స్వామి దాస్ ఎంపికకు మద్దతు ఇవ్వాలని మిగతా వారిని ఎమ్మెల్యే కోరినట్లు తెలిసింది. అలాగే కార్వేటినగరం, ఎస్ఆర్ పురం, పెనుమూరు మండలాలకు ప్రస్తుతం ఉన్న అధ్యక్షులనే కొనసాగించుటకు మీరు సహకరించాలని ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చినట్లు పోటీపడిన అభ్యర్థులు తెలిపారు. పాలసముద్రం మండలంలో రాష్ట్ర నేత, గంగాధర నెల్లూరు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ చిట్టి బాబు నాయుడు వర్గంగా ఉన్న వాసు నాయుడు ఎంపికను ఎమ్మెల్యే సమర్థించకపోవడంతో ఆ మండలంలో చర్చనీయాంశమైంది. అలాగే గత ఎన్నికలప్పుడు బెంగుళూరు నుంచి ఉట్టిపడిన శివనాయుడికి ఎమ్మెల్యే మద్దతు పలకడంతో వ్యతిరేకవర్గ మైన ప్రస్తుత మండల పార్టీ అధ్యక్షుడు సి రాజేంద్రన్, వాసు నాయుడులు వ్యతిరేకిస్తున్నారు. ఎంపికలో భాగంగా శ్రీ రంగరాజపురం మండల అధ్యక్ష పార్టీ కావాలని ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, సీనియర్ నేతగా ముద్రపడిన గుత్తా వేమన నాయుడు, నియోజకవర్గ ఐటీడీపీ కార్య నిర్వహణ సభ్యుడుగా ఉన్న, యువనేత పైనేని మురళిలు పార్టీ అధ్యక్ష ఎంపికలో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే జయశంకర్ నాయుడు ఎంపికను మీరు సమర్థించాలని ఇరువురికి సూచించారు. దీంతో పైనేని మురళి, వేమన నాయుడు లు తిరస్కరించారు. అధ్యక్ష బాధ్యతను యువ నేతకు అప్పగిస్తే, భావి రాష్ట్ర ముఖ్యమంత్రిగా లోకేష్ బాబుకు బాసటగా నిలుస్తానని పైనేని మురళి అబ్జర్వర్ల, ఎమ్మెల్యేల ఎదుట వాపోయారు. దీంతో నా ఎన్నికల్లో నీవు పనిచేయలేదని ఎమ్మెల్యే పైనేని మురళికి సూచించారు. దీంతో అతను నిరాశతో వెను తిరిగినట్లు సమాచారం. వెదురు కుప్పం మండలంలో ప్రస్తుతం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత పార్టీ అధ్యక్షుడుగా ఉండడం, ఇక్కడ పోటీపడుతున్న కిషన్ చంద్ ఎన్ఆర్ఐ గా ఉండడం, గత మాజీ అధ్యక్షుడు ఎస్సీ సామాజిక వర్గం అయిన మురళి మోహన్ లకు మండల అధ్యక్ష పదవి దక్కించుకోవాలని ప్రయత్నించారు. ఈ క్రమంలో సీనియర్ నేతగా ఉన్న మురళికి రానున్న స్థానిక ఎన్నికల్లో జడ్పిటిసిగా, లేకుంటే ఎంపీపీగా అవకాశం ఇప్పించి తన గెలుపుకు కృషి చేస్తానని కిషన్ చంద్ ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. దీంతో కిషన్ చంద్ కు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే మురళిని సమర్థించినట్లు తెలిసింది. అందుకు మురళి ససేమిరా అన్నట్లు తన నేతల ముందు వాపోయారు. పెనుమూరు మండలంలో రుద్రయ్య నాయుడు తనకు ఆకాశం కల్పించాలని ఎమ్మెల్యే , అబ్జర్వర్లకు సూచించారు. అలాగే పెనుమూరుకు కృష్ణమూర్తి, మనోహర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడులు పార్టీ అధ్యక్ష పదవి కావాలని కోరారు. వీరికి ఎమ్మెల్యే సహకరించలేదని తెలిసింది. అలాగే కార్వేటినగరం మండలం ప్రస్తుత పార్టీ అధ్యక్షుడుగా ఉన్న చంగల్రాయ్ యాదవ్ నియామకం దాదాపు ఖరారు అయినట్లు తెలిసింది. అయినా అదే సామాజిక వర్గం నుంచి రవి యాదవ్ తనకు అధ్యక్ష పదవి కట్టబెట్టాలని కోరారు. రవి యాదవ్ సూచనలు ఎమ్మెల్యే పట్టించుకోలేదని కార్యకర్తల మనోభావం గా తెలిసింది.కార్వేటినగరం మండలంలో ఇప్పటికే చెంగల్రాయ్ యాదవ్ పనితీరుపై నేతలు, కార్యకర్తలు మనోభావం దెబ్బతిన్నట్లుగా తెలుస్తోంది.

**అబ్జర్వర్లు పనితీరు ఏంటి...**

పార్టీ అధిష్టానం సూచనల మేరకు మండల పార్టీ అధ్యక్ష ఎంపిక సజావుగా జరగాలని ఆదేశాలు జారి చేశారు. ఈ క్రమంలో మండలానికి మూడు అబ్జర్వర్లు సమక్షంలో ఎమ్మెల్యే అభిప్రాయం మేరకు పార్టీ అధ్యక్ష ఎంపిక జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ఏ అభ్యర్థికి, ఏ మేరకు మండల నాయకత్వంలో ఏకాభిప్రాయం కుదిరే వారినే మండల అధ్యక్షులుగా ఎంపిక చేయాల్సి ఉంది. ఇలాంటి నిబంధనలను అబ్జర్వర్లు ఎక్కడ పాటించలేదని.. మండల అధ్యక్ష అభ్యర్థికి పోటీపడిన నేతల మనోగతంగా తెలిసింది. ఇకనైనా అబ్జర్వర్లు వివిధ మండలాల్లో పోటీపడిన అభ్యర్థుల మనో గతాన్ని... వారి అభ్యర్థనను మన్నించి కార్యకర్తల ఏకాభిప్రాయం మేరకు ఎంపిక చేస్తే బాగుంటుందని, లేకుంటే తను ఇష్టానుసారంగా మండల అధ్యక్షుడుగా ఎంపిక చేస్తే, రానున్న స్థానిక ఎన్నికల్లో సహకరించడం జరగదని ముక్తకంఠంతో వాపోతున్నారు.

## వ్యవసాయ బోరు మోటర్లకు మీటర్లు బిగించవద్దు

స్వర్ణ సాగరం. బుచ్చినాయుడు కండ్రిగ



మండలంలో భారత కమ్యూనిస్టు పార్టీలు సిపిఐ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముట్టడి వైసిపి బాటలోనే టిడిపి కూటమి ప్రభుత్వంమోడీ ఆదేశాలకు లొంగి గత వైసిపి ప్రభుత్వం అదానీ కంపెనీ నుండి సెకి సంస్థ ద్వారా 25 సంవత్సరాల పాటు 7 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నది. గత ప్రభుత్వానికి పెద్దలకు రూ. 1,750 కోట్లు లంచాలు ఇచ్చి ఈ ఒప్పందం చేసుకున్నారని అమెరికా కోర్టుల్లో సాక్షాధారాలతో కేసు నమోదు అయింది. ఈ ఒప్పందం తప్పని నేటి ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ హైకోర్టులో కేసు వేశారు. ఈ ఒప్పందం వల్ల 25 సంవత్సరాల కాలంలో రూ. 1.20 లక్షల కోట్లు భారం జనంపై పడుతుందని స్వయంగా చంద్రబాబు శ్వేత పత్రంలో ప్రకటించారు. కానీ మాట మార్చి నేడు ఒప్పందాన్ని కొనసాగిస్తున్నారు. కనీసం విచారణ కూడా చేయటం లేదు. అవినీతిపై పోరాటమంటూ రోజు ప్రకటనలు చేస్తూ గత ప్రభుత్వ అవినీతిని నేటి పాలకులు కాపాడుతున్నారు. జగన్ బినామీ సంస్థగా చెప్పిన షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ నుండి టిడిపి ఎన్నికల బాండ్ల రూపంలో రూ. 30 కోట్లు తీసుకున్నది. అదానీతో చేసుకున్న యూనిట్ రూ. 2.49 పైసలు ఒప్పందం చేసుకుంటున్నది. గతం నుండి చేసుకొన్న అడ్డగోలు, అక్రమ. అవినీతి కార్పొరేట్ ఒప్పందాల వలన చార్జీలభారం పెరుగుతున్నది. ఒకవైపున పాటు సాగించే ఒప్పందాలను చౌకైన, నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్ అని నమ్మించి దగా చేశారు. ఇంధన సర్దుబాటు (ఎఫ్ఎఎపిపిసి) చార్జీల విధానమే తొలగించాలి. అదనపు భారాలు తగ్గించాలి. ఇప్పటి వరకు వసూలు చేసిన సర్దుబాటు ఛార్జీలను ప్రజలకు తిరిగి చెల్లించాలి. ట్రూడౌన్ ద్వారా బిల్లులు తగ్గించాలన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి కత్తి ధర్మయ్య, సిపిఐ మండల కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి



పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 11.

మండల కేంద్రమైన పెళ్ళకూరులోని దళిత కాలనీకి చెందిన మరియం సుధాకర్ (45) సోమవారం సాయంత్రం విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు. కాలనీలోని విద్యుత్ స్తంభం నుంచి గృహ విద్యుత్తు సరఫరా రాకపోవడం వల్ల కర్ర సాయంతో విద్యుత్ తీగలను సరి చేసే ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు గుర్తించి హుటాహుటిన చికిత్సలు నిమిత్తం శ్రీకాళహస్తికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు కుమార్తె ఉన్నారు. సుధాకర్ మృతితో కాలనీలో విషాదం నెలకొన్నది.

## స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలి సిపిఐ




వెంకటగిరి -స్వర్ణసాగరం

రైతులకు ప్రజలకు స్మార్ట్ మీటర్ల పంపిణీని వెంటనే ఆఫ్ చేయాలని స్థానిక పాలకేంద్రం సెంటర్ వద్ద గల విద్యుత్ ఏడి కార్యాలయం వద్ద సోమవారం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పల్లెపాటి బాలకృష్ణయ్య ఆధ్వర్యంలో లో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను వెంటనే కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, డిమాండ్ చేశారు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు జాన్ మాట్లాడుతూ సామాన్యులకు భారంగా మారబోతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి - విద్యుత్ చార్జీల నిలువు దోపిడిని ఆపాలి - ప్రమాదకర స్పాట్ మీటర్లు రద్దు చేయాలి అంటూ నినాదాలు చేశారు ఫ. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి కర శివకుమార్ మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ప్రజలకు స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు పెనుబారం గా మారుతాయని తెలిపారు. అదానికి కోట్ల రూపాయలు కూడా పెట్టేందుకు స్మార్ట్ మీటర్లను తీసుకుని వచ్చారని విమర్శించారు. అనంతరం వీధి వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ మీటర్ల ప్రక్రియని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమని కూటమి నేతలకు పిలుపునిచ్చారని గుర్తు చేశారన్నారు. నేడు అదాని స్మార్ట్ మీటర్లు బిగించడంలో కూటమి ప్రభుత్వం ఉందని, అలానే స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ కార్యాలయం వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు భాస్కర్ కుమార్ ముని కృష్ణారెడ్డి ఏఐఎస్ఎఫ్ మధు రమణయ్య తదితరులు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా చైతన్య రెడ్డి జన్మదిన వేడుకలు

బంగారుపాళ్యం,స్వర్ణసాగరం, ఆగస్టు 11



బంగారుపాళ్యం మండలం, కల్లూరు పల్లె గ్రామ వాసి చైతన్య రెడ్డి జన్మదిన వేడుకలు మిత్రుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిపించారు. చైతన్య రెడ్డి చదువులలో , క్రీడలలో ఉత్సాహంగా పాల్గొంటూ గ్రామంలోని యువకులందరికి ఆదర్శంగా ఉండేవారని తనని ఆదర్శంగా తీసుకొని అందరూ యువకులు చదువుకోవడం, ఉద్యోగాలకు వెళ్లడం జరిగిందని మిత్రులు అందరూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమలాపతి రెడ్డి, వినోద్, నగేష్, సంజు, నాని, యుగేష్, హరీష్, ఉదయ్, పనింద్ర, సాయి, తనీష్, ఖుషి తోసి, మోహన్, నితిన్, పవన్, మరియు మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు నగదు బహుకరణ





స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024- 25 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుచ్చినాయుడుకండ్రిగ వాస్తవ్యులు, పి. వెంకట రమణయ్య రెండు లక్షల రూపాయలును, గ్రామీణ బ్యాంకు నందు డిపాజిట్ చేసి అందుకు వస్తున్న వడ్డీ 16 వేల రూపాయలను, బాలికల విభాగంలో 523 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన, వి.సుప్రియ, కు ఎనిమిది వేల రూపాయలు అదేవిధంగా బాలుర విభాగంలో 529 మార్కులు తో ప్రథమ స్థానంలో నిలిచిన, కే. జ్ఞానేశ్వర్ అనే విద్యార్థికి ఎనిమిది వేల రూపాయలు చొప్పున పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రమణయ్య చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య ను అభ్యసించడానికి ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతో దోహదం చేస్తాయనే భావించి తమ వంతు సహకారం అందించాలని ఉద్దేశంతో ఇలాంటి నగదు బహుమతులు అందజేస్తున్నామని పి. వెంకట రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పేద పిల్లలకు ఇలాంటి ప్రోత్సాహం అందిస్తున్న పి.వెంకటరమణయ్య సేవలు అభినందనీయమని తెలిపారు.

విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకొని ఈ సంవత్సరం కూడా పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు

## పాలకమండలి నియామకం కొరకు దరఖాస్తులు స్వీకరణ

నాగలాపురం -స్వర్ణ సాగరం ఆగస్టు 11:



నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలసియుండు శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో పాలకమండల నియామకం కొరకు ఆగష్టు 08 వ తేదీ నుండి దరఖాస్తులు చేసుకొనుటకు దేవదాయశాఖ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారిణి లత తెలిపారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ

సదరు ఉత్తర్వులు ప్రకారం పాలక మండలి నియామకం కొరకు దరఖాస్తులు తిరుపతి జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో చేసుకొనుటకు చివరి తేదీ ఆగస్టు 27 గా నిర్ణయించడమైనది. అయితే దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు దరఖాస్తులను శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం కార్యాలయంలో సమర్పించవలసినదిగా ఆదేశాలు జారీ రావడంతో ఆశావహులు వారి యొక్క పాలకమండలి నియామకం దరఖాస్తులను ఆగస్టు 27 వ తేదీ వరకు శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం కార్యాలయం పని వేళలు అనగా ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల లోపు ఇవ్వగలరని కోరారు.

# పౌల్ట్రీ నిర్మాణ పనులు నిలిపివేయాలని గ్రీవెన్స్ లో ఫిర్యాదు



పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 11.

మండలంలోని చిల్లకూరు గ్రామంలో మన్నే ముత్తెరి చెరువు సమీపంలో జరుగుతున్న పౌల్ట్రీ నిర్మాణపు అక్రమ పనులను తక్షణమే నిలిపివేయాలని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో తహసిల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందించి ఫిర్యాదు చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనుమతులు, పంచాయతీ పాలకవర్గం అనుమతులు లేకుండా గ్రామానికి అత్యంత సమీపంలో కోళ్ల ఫారం నిర్మించడం సమంజసం కాదని వివరించారు. 1.70 ఎకరాలు చెరువు పోరంబోకు భూములను ఆక్రమించి పౌల్ట్రీ నిర్మాణం కోసం కొనుగోలు చేసిన భూముల్లో కలిపేసుకోవడంపై పూర్తిస్థాయి-ంలో దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ అనుమతులు లేకుండా చెరువులో గ్రావెల్లో ఏర్పాటు చేయడంపై ఆ శాఖ అధికారులకు సమాచారం అందించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పేరం రమేష్ నాయుడు, వేలూరు మురళీ కృష్ణారెడ్డి, సర్పంచులు దేవా రెడ్డి నాగేంద్రరెడ్డి, మునిష్, పెంచలయ్య శిరసనం బేటి చైతన్య కృష్ణారెడ్డి, దువ్వూరు రాకేష్ రెడ్డి, లోకేష్ నాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో బీఎస్పీ సమీక్ష సమావేశం..!

## నియోజకవర్గ అధ్యక్షులు కర్లపూడి ఆదేయ్య.



స్వర్ణ సాగరం(నాయుడుపేట) ఆగస్టు 11.

బహుజన సమాజ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు బందెల గౌతమ్ ఆదేశాల మేరకు సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గ రివ్యూ సమావేశం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నియోజకవర్గ అధ్యక్షులు కర్లపూడి ఆదేయ్య అధ్యక్షతన బహుజన సమాజ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఓజిలి మండల పూర్తిస్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు జానకి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్ సుధాకర్, భాస్కర్ గౌడ్, కైలాసం చెంగయ్య లు మాట్లాడారు. బహుజన సమాజ పార్టీ అభివృద్ధికి, ఓటు చైతన్యం, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటుపై చర్చించారు. కలికిరి సుబ్రమణ్యం, నాగిశెట్టి రాజయ్య, దొడ్ల పెంచలయ్య ,క్షేత్రయ్య బాంసెఫ్ నాయకులు పాల్గొన్నారు.

# మార్గదర్శులుగా మారి - బంగారు కుటుంబాలకు చేయూత అందిద్దాం

## తహసీల్దార్ రవి శంకర్



కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 11

బంగారు కుటుంబాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మార్గదర్శులుగా ముందుకు రావాలని కనిగిరి తహసీల్దార్ రవి శంకర్ అన్నారు. సోమవారం తహసీల్దార్ మార్గదర్శిగా ముగ్గు బావి సచివాలయం పరిధిలోని బంగారు కుటుంబమైన షైక్ మహబూబ్ బి కుటుంబ సభ్యులను సందర్శించి ప్రేమ పూర్వకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవి శంకర్ మాట్లాడుతూ, "%ూ%4 జీరో పావర్టీ స్కీమ్ ం ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, ప్రతి జీవితానికి నూతన ఆశ. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మనం అందరం కలిసి బంగారు కుటుంబాలకు చేయూత అందించాలని పేర్కొన్నారు. వారి అవసరాలను తెలుసుకుని, వారికి నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం వారి కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో వీ ఆర్ ఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సింగిల్ విండో చైర్మన్ గా భాస్కర్ రెడ్డి



రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 11

రేణిగుంట మండలం ప్రాథమిక పరపతి సంఘం చైర్మన్ గా పాత రేణిగుంటకు చెందిన భాస్కర్ రెడ్డి ని నియమిస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి ఆయన చేసిన సేవలను టిడిపి గుర్తించి సింగిల్ విండో చైర్మన్ గా నియమించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బొజ్జల రిషిత రెడ్డి, బొజ్జల బృందమ్మ, ముని చంద్రారెడ్డి, చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డిలకి మండల, పట్టణ నాయకులకు వెంకటాపురం గ్రామపంచాయతీ టిడిపి నాయకులకు పాత రేణిగుంట భాస్కర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# అక్షరాంధ్ర ఉల్లాస్ తో 100% అక్షరాస్యతే లక్ష్యం

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ







మండలంలోని వెలుగు కార్యాలయం సోమవారం అక్షర ఆంధ్ర ఉల్లాస్ పై వాలంటీర్ టీచర్లు కు,శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2029 లోపు ప్రతి ఒక్కరూ 100శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నది, దీనిని ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలి ఇందులో గ్రామస్థాయిలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకొచ్చి పరిశరించు కోవాలని తెలియ జేశారు. మండల విద్యాశాఖాధికారి రవీంద్ర నాథ్ మాట్లాడుతూ అన్ని దానాలకంటే విద్యాదానం గొప్పది వాలంటీర్ టీచర్లు గా మీరు పది మందికి విద్య నేర్పించడం మీరు చేసుకొన్న అదృష్టం విద్య యొక్క ఆవశ్యకత వారిలో కల్పించి వారు 100 శాతం విద్యావంతులైయేలా కృషి చేయాలని తెలియ జేశారు. ఏపియం మునెయ్య మాట్లాడుతూ గత సంవత్సరం లో 445 మందిని విద్యావంతులు చేయడం జరిగింది. ప్రస్తుతం మన మండలంలో 7500 మంది వయోజనులు నిరక్షరాస్యులుగా ఉన్నారు వీరిలో మొదటి విడత వెలుగు ద్వారా 1940 మంది, ఎంజీఎన్ ర్ జి ఈ స్ ద్వారా 210 మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా తయారు చేయడానికి ప్రతి 10 మందికి ఒక వాలంటీర్ టీచర్ ను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరిగింది. మీరు గ్రామాలలో సేవ భావంతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలి అని తెలియ జేశారు, ఈ కార్యక్రమంలో ఏపిఓ దేవరీ, సీసీ లు వెంకటరత్నం, వీరజిన్నప్ప, పయని, జీవ , విఓ ఏ లు, వాలంటీర్ టీచర్లు పాల్గొన్నారు

# వరిలో సమగ్ర యాజమాన్యం రైతుకు లాభదాయకం

స్వర్ణసాగరం ప్రతినిధి రమేష్ దక్కిలి



దక్కిలి మండలం దక్కిలి గ్రామం నందు పీఎం ఆర్కే వి వై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారిచే రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ,కేవలం రసాయన ఎరువులు అనే వాడకుండా, రసాయన ఎరువులతో పాటు,సేంద్రియ ఎరువుల ను,సమతుల్యములో వాడడం మరియు కేవలం పురుగుమందులు నే వాడకుండా జీవ శిలింద్రనాశనలను, లింగాకర్షక బుట్టలను జిగురు అట్టల వంటి వాటిని వాడుతూ పురుగుమందులను తగ్గించుకున్నట్లయితే,రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా దక్కిలి మండల వ్యవసాయ అధికారి శ్రీమతి శిరీష మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మరియు పంటల బీమా పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు,శ్రీనివాస్, జిల్లా వనరుల కేంద్రం ఏ ఈఓ రవిప్రసాద్ మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పౌల్ట్రీ నిర్మాణం నిబంధనలకు విరుద్ధం

## టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ రెడ్డి

పెళ్ళకూరు స్వర్ణసాగరం ఆగస్టు 11.



మండలంలోని చిల్లకూరు గ్రామం మన్నెముత్తూరు చెరువు సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న పౌల్ట్రీ నిర్మాణం నిబంధనలకు విరుద్ధం అని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణరెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నీటిపారుదల శాఖ అనుమతులు తీసుకోకుండా కోళ్ల పరిశ్రమ స్థాపన వరకు గ్రావెల్ రోడ్ ఏర్పాటు చేయడం, 50 లక్షలు విలువ చేసే చెరువు మట్టిని యంత్రాలతో త్రవి తరలించడం నిబంధనలకు విరుద్ధం అన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని, త్వరలో పరిష్కారం చూపకపోతే ప్రభుత్వ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామన్నారు.

**కోళ్లపరిశ్రమ స్థాపనకు అనుమతులు లేవు: స్వర్ణముఖి సిస్టం మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు......** చిల్లకూరులో కోళ్ల పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వ అనుమతులు లేవని స్వర్ణముఖి సిస్టం ఆయకట్టు మాజీ ప్రెసిడెంట్ పేరం రమేష్ నాయుడు పేర్కొన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, పొల్యూషన్ అధికారుల అనుమతులు లేకుండా చెరువులో సుమారు 50 లక్షలు విలువ చేసే మట్టిని 10ఎకరాల భూమిలో తరలించి లెవలింగ్ పనులు చేసి కోళ్ల పరిశ్రమను ఎలా స్థాపిస్తున్నారు అంటూ ప్రశ్నించారు. ఈమట్టి తరలింపులకు ఎవరు సహకరించారు, ఎవరు అనుమతులు ఇచ్చారు, దీని వెనుక ఉన్న ఏపార్టీ నాయకులు ఉన్నారని ప్రశ్నించారు.? క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు గ్రామంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడం సరైన పద్ధతి కాదన్నారు. టిడిపి సీనియర్ నేత పాపాడి రాజగోపాల్ రెడ్డి, సన్నాడి వేణురెడ్డి ధైర్యంగా వెళ్లి అక్రమ కట్టడాలను అడ్డుకోవడం జరిగిందన్నారు.

**టిడిపి నాయకులు బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయరు : శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, టిడిపి యువనేత...** డబ్బు కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరు కూడా బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయరని టిడిపి యువ నేత శిరసనంభేటీ చైతన్య కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. అక్రమ మట్టి త్రవ్వకాలు, గ్రావెల్ త్రవ్వకాలపై ఇటీవల కొందరు వైసిపి నాయకులు సూళ్లూరుపేటలో ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయితే సత్యనారాయణ రెడ్డి సొంత గ్రామమైన చిల్లకూరులో చెరువు మట్టిని యంత్రాలతో తవ్వేస్తుంటే ఉన్నతాధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు? దీని వెనుక జరిగిన పాత్ర ఏమిటో స్థానికులకు కూడా బాగా తెలుసు అన్నారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రాజారెడ్డి, వేణురెడ్డి డబ్బుకు పాల్పడి ఉంటే అక్రమ పౌల్ట్రీ కట్టడాలను ఎందుకు అడ్డుకుంటారని, అలాంటి వారిపై నిందలు వేయడం సరికాదు అన్నారు.

**పౌల్ట్రీ నిర్మాణానికి ప్రాథమిక అనుమతులు లేవు: దువ్వూరు రాకేష్ రెడ్డి టిడిపి యువనేత %ూ....** %చిల్లకూరులో కొత్తగా నిర్మిస్తున్న కోళ్ల పరిశ్రమ కు ప్రాథమిక అనుమతులు లేవని తెలుగుదేశం పార్టీ యువ నేత దువ్వూరు రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. కోళ్ల పరిశ్రమ కోసం సేకరించిన వ్యవసాయ భూమిలో లెవెలింగ్ పనుల కోసం 50 లక్షలు విలువ చేసే చెరువు మట్టిని అక్రమంగా యంత్రాలతో త్రవించి తరలించడం జరిగిందన్నారు. మట్టి తరలింపులో అంతా కూడా వైకాపా నాయకుల కను సన్నల్లోనే జరిగిందని ఆరోపించారు. పగటిపూట చేపట్టిన మట్టి త్రవ్వకాలను ఎప్పటికప్పుడు అడ్డుకోవడం జరిగిందన్నారు. కోళ్ల పరిశ్రమ వద్దకు వాహనాల రాకపోకల కోసం చెరువులో అక్రమంగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయడం పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, మునిష్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేపట్టం పథకాలపై సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలి

## మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి



కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్ట్ 11


ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి 4 పై మరియు బంగారు కుటుంబం కార్యక్రమం గురించి సచివాలయ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని మునిసిపల్ కమీషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం కనిగిరి పురపాలకసంఘం కార్యాలయంలో మునిసిపల్, సచివాలయ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పి 4 నూతన మార్గదర్శుల రిజిస్టేషన్ ప్రక్రియ గురించి అవగాహన కల్గి ఉండాలన్నారు. బంగారు కుటుంబాలను గుర్తించి వారికి లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని, అనర్హులను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రజలందరూ బంగారు కుటుంబంలో భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, ఆర్ ఐ ప్రదీప్, మునిసిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గణనాధుని సేవలో రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్

కాణిపాకం, ఆగస్టు 11 : స్వర్ణ సాగరం



గణనాధుని సేవలో రాష్ట్ర భాజపా పి.వి.ఎన్. మాధవ్.కాణిపాకం శ్రీ వరసిద్ధి స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ మరియు రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ , స్వామి వారిని దర్శించుకున్నారు, ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, జిల్లా , నియోజవర్గ మండల నాయకులు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.



# అలరించేలా 'మాస్ జాతర' టీజర్

గత కొన్నాళ్లుగా రవితేజ చేస్తున్న సినిమాలు అయితే చేస్తున్నాడు గానీ పెద్దగా వర్కౌట్ కావట్లేదు. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని 'మాస్ జాతర' అనే మూవీ చేశాడు. ఈనెల 27న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే రెండు పాటలు రిలీజ్ కాగా ఓ మాదిరి వైరల్ అయ్యాయి. ఇప్పుడు టీజర్ రిలీజ్ చేశారు. రవితేజ సినిమా అంటే ఏయే అంశాలు ఉంటాయో.. 'మాస్ జాతర' టీజర్ అలానే ఉంది. కామెడీ, ఫైట్స్, రొమాన్స్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ మూవీలో రవితేజ.. రైల్వే పోలీస్‌గా కనిపించబోతున్నాడు. శ్రీలీల హీరోయిన్. భాను భోగవరపు అనే కొత్త దర్శకుడు.. ఈ మూవీతో పరిచయమవుతున్నాడు. నాగవంశీ.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మరి ఈ సినిమాతోనైనా రవితేజ కమ్ బ్యాక్ ఇస్తాడేమో చూడాలి?

# వార్ ప్రీ రిలీజ్ ఈవెంట్.. ప్రత్యేకంగా ఓ వీడియో

ఎన్టీఆర్ హీరోగా నటించిన బాలీవుడ్ సినిమా 'వార్ 2'. హృతిక్ రోషన్ మరో హీరో. ఈ గురువారం మూవీ థియేటర్లలోకి రానున్న సందర్భంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమంలో ఓ విషయం చెప్పడం మర్చిపోయిన తారక్.. ప్రత్యేకంగా ఓ వీడియో రిలీజ్ చేశాడు. క్షమించాలి అని అంటూ తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పుకొచ్చాడు. 'వేదికపై ముఖ్యమైన విషయం ఒకటి చెప్పడం మర్చిపోయాను, క్షమించాలి. నా 25 ఏళ్ల కెరీర్‌ని అభిమానులతో పంచుకునే ఆనందంలో ఈ తప్పు జరిగింది. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన తెలంగాణ ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అలానే హైదరాబాద్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వారందరికీ నా కృతజ్ఞతలు. మీ అందరికీ శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నా. మీరు చాలా సహకారం అందించారు. అభిమానులని ఎంతో బాధ్యతగా చూసుకున్నారు. వారి ఆనందానికి కారణమయ్యారు' అని ఎన్టీఆర్ చెప్పుకొచ్చాడు. ఎన్టీఆర్, హృతిక్ చేసిన 'వార్ 2' సినియా.. యష్ రాజ్ స్పై యూనివర్స్‌లో భాగం. కియారా అద్వాణీ హీరోయిన్ కాగా అయాన్ ముఖర్జీ దర్శకుడు. తెలుగులో సితార ఎంటర్ టైన్‌మెంట్స్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. అందుకే ఆదివారం రాత్రి ఈవెంట్‌లో నిర్మాత నాగవంశీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా బాగోలేకపోతే తనని పదింతలు ఎక్కువ తిట్టండి అని ఛాలెంజ్ చేశారు. మరోవైపు తారక్ కూడా చిత్ర ఫలితంపై నమ్మకంగా ఉన్నారు. హృతిక్‌తో కలిసి కాలర్ ఎగరేసి మరీ నమ్మకాన్ని చూపించారు.



# విడాకుల రూమర్స్.. హన్సిక ఆసక్తికర పోస్ట్



హీరోయిన్ హన్సిక వ్యక్తిగత జీవితంపై గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు వస్తున్నాయి. ఆమె భర్తకు దూరంగా ఉందని, త్వరలోనే విడాకులు తీసుకుంటున్నారనే వార్తలు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా హన్సిక తన ఇన్‌స్టా స్టోరీలో పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా పుట్టిన రోజు (ఆగస్ట్ 9) వేడుకలు జరుపుకున్న ఆమె.. ఈ ఏడాది తనకు చాలా స్పెషల్ అని..ఎన్నో పాఠాలు నేర్పిందని అన్నారు. 'ఈ ఏడాది(2025) నేను అడగకుండానే నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాలో నాకు తెలియనంత బలం ఉందని తెలిసేలా చేసింది. ఈ పుట్టినరోజున మీ అందరి శుభాకాంక్షలతో నా హృదయం ఉప్పొంగిపోతోంది. చాలా ప్రశాంతంగా ఉంది. ఒక్కోసారి చిన్న విషయాలు కూడా ఎంతో ఆనందాన్నిస్తాయి. ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని హన్సిక ఇన్‌స్టా పోస్ట్‌లో రాసుకొచ్చింది. దీంతో మరోసారి హన్సిక విడాకుల విషయంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. 2022 డిసెంబర్‌లో హన్సిక తన ప్రియుడు సోహైల్‌ని వివాహం చేసుకుంది. సోహల్‌కు ఇది రెండో పెళ్లి. హన్సిక స్నేహితురాలితో ఆయనకు ఇంతకుముందే పెళ్లై విడాకులు తీసుకున్నాడు. వీరి వివాహాన్ని 'లవ్ షాదీ డ్రామా' అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. పెళ్లయిన రెండేళ్లకే హన్సికకు, భర్తకు మధ్య మనస్పర్థలు తలెత్తాయని, దీంతో ఇద్దరు విడిపోయినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం వైరల్ అవుతోంది. సోహల్‌ది పెద్ద కుటుంబం అని, వారితో హన్సిక కలవలేకపోవడం వల్లే మనస్పర్థలు వచ్చాయని, దీంతో ఆమె తన తల్లి వద్దనే ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.




# రూ.100 కోట్ల క్లబ్‌లో విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'

అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ విషయాన్ని చిత్రబృందం ప్రకటించింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాకు నాగవంశీ నిర్మాతగ వ్యవహారించగా.. భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటించింది. అయితే జూలై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. తాజాగా ఈ చిత్రం రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో గీతా గోవిందం(రూ.130 కోట్లు) తర్వాత రెండోసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన హీరోగా విజయ్ రికార్డును అందుకున్నాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూరి (విజయ్ దేవరకొండ) ఓ కానిస్టేబుల్. సూరి అన్న శివ (సత్యదేవ్). అనుకోని కారణాల వల్ల శివ చిన్నప్పుడే ఇల్లు వదిలి వెళ్లిపోతాడు. తన అన్న కోసం సూరి వెదుకుతూనే ఉంటాడు. ఓ సందర్భంలో సూరి తన పై అధికారిపై చేయి చేసుకుంటాడు. అందుకు సంబంధించి విచారణ జరుగుతున్నప్పుడు సూరికి ఓ మిషన్ అప్పగిస్తారు అధికారులు. అండర్ కవర్ ఏజెంట్‌గా మారి శ్రీలంకలో వున్న ఓ గ్యాంగ్‌ని అదుపులోకి తీసుకోవాలి. ఇదీ ఆ మిషన్. ఇలా చేస్తే సూరికి తన అన్నని కలిసే అవకాశం దొరుకుతుంది. ఈ మిషన్‌కి ఒప్పుకున్న సూరి శ్రీలంక పయనం అవుతాడు. తర్వాత ఏం జరిగింది? అసలు శివ లంకకి ఎందుకు వెళ్లాడు? అక్కడ ఎలాంటి పనులు చేస్తున్నాడు? అన్న కోసం వెళ్లిన సూరికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? ఇదంతా మిగతా కథ.